


ఉష్ణోగ్రత (అంచనా) 16-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	27
తెనాలి	39	28
నరసరావుపేట	38	27
బాపట్ల	38	28
రెంటచింతల	38	26
చీరాల	38	28

టీడీపీలో.. మినీ కోలాహలం

- 18 నుంచి నియోజకవర్గాల్లో నిర్వహణ
- స్వయంగా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యేలు
- 22, 23 తేదీల్లో ఒక రోజు జిల్లా స్థాయి మహానాడు
- తుది దశలో సంస్థాగత ఎన్నికలు.. 23 కల్లా జిల్లా అధ్యక్షుల ప్రకటన



బాపట్లలోని టీడీపీ కార్యాలయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీలో మహా సందడి మొదలైంది. ఒకవైపు కడపలో మహానాడు పండుగకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతుండగా.. అందుకు సన్నాహకంగా నియోజకవర్గ స్థాయిల్లో మినీ మహానాడులకు ఎక్కడికక్కడ స్థానిక నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో తమ్ముళ్లలో మినీ మహానాడుల కోలాహలం నెలకొంది. ఒకవైపు మహాపండుగలా మహానాడును నిర్వహించేందుకు పార్టీ అధినాయకులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో కూడా మహానాడుల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎన్టీఆర్ జయంతిని పురష్కరించుకుని ఈ నెల 27 నుంచి కడపలో మూడు రోజుల పాటు జరిగే మహానాడుకు తరలివెళ్లేందుకు శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర మహానాడుకు సన్నద్ధతగా నియోజకవర్గాల్లో మహానాడుల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాష్ట్ర మహానాడుకు ముందుగా ఈ నెల 18 నుంచి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహానాడులను నిర్వహిం చనున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మినీ మహానాడుల నిర్వహణ ఏర్పాట్లను ఎమ్మెల్యేలు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో మినీ మహానా డులకు సంబంధించి తేదీలను కూడా ప్రకటించారు. మినీ మహానాడులలో ఆయా నియోజకవర్గాల పరిధిలో నెల కొన్న సమస్యలతో పాటు పలు అంశాలపై చర్చించి తీర్మానాలను చేస్తారు. వీటిని రాష్ట్ర మహానాడుకు నివేదిస్తారు. మినీ మహానాడుల అనంతరం ఈ నెల 22, 23 తేదీల్లో ఏదో ఒక రోజు జిల్లా మహానాడు నిర్వహిస్తారు. దీనికి ముందే పార్టీ జిల్లా కొత్త అధ్యక్షుడ్ని రాష్ట్ర పార్టీ నియమిస్తుంది. కొత్త అధ్యక్షుడి నేతృత్వంలో జిల్లా మహానాడు జరుపుతారు.

మొదలైన సంస్థాగత సందడి

నియోజకవర్గాల్లో నిర్వహించే మహానాడుల కంటే ముందే పార్టీ సంస్థాగత ఎన్నికలను పూర్తి చేస్తారు. ఇప్పటికే గ్రామ, వార్డు, డివిజన్ స్థాయిలో ఈ ఎన్నికల ప్రక్రియ తుది దశలో ఉంది. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో ఎన్నికలు పూర్తయ్యాయి. ఈ కమిటీలకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియ కూడా పూర్తి చేస్తున్నారు. రెండో దశలో ఈ నెల 18లోగా నగర, పట్టణ, మండల కమిటీలతో పాటు అనుబంధ సంఘాల బాధ్యు ల నియామక ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియను పర్యవేక్షించడానికి అధిష్ఠానం రాష్ట్ర స్థాయి నుంచి జిల్లాలకు పరిశీలకులను ప్రత్యేకంగా నియమించింది. ఎన్నికల్లో పార్టీ కోసం పాటు పడిన వారికి అనుబంధ కమిటీల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. బూత్, క్లస్టర్ స్థాయిలో ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్న వారికి పదవులు కేటాయించనున్నారు. ఆయా పదవులకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ఎంపిక కొన్ని చోట్ల ఎమ్మెల్యేలకు తల నొప్పిగా మారింది.

పుర పాఠశాలలకు.. పోస్టులు



గుంటూరు : మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల

- తీరనున్న ఉపాధ్యాయుల కొరత
- అవసరమైన పాఠశాలల్లో ఎస్జీటీ పోస్టులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాకు 190కిపైగా ఎస్ఏలు
- ఉన్నత పాఠశాలలకు ఇక పూర్తిస్థాయి హెచ్ఎంలు
- మున్సిపాల్టీల్లో ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీకి ఆమోదం

గుంటూరు (విద్య), మే 15 (ఆంధ్ర జ్యోతి): మున్సిపాల్టీల పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు, తరగతులకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరు. గత కొన్నేళ్లుగా మెరుగైన ఫలితాలతో మున్సిపల్ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు పోటీ పడుతున్నాయి. అయితే ఉపాధ్యాయుల కొరతతో మున్సిపల్ పాఠశాలల్లోని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇప్పటిదాకా మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులతో నెట్టుకొస్తున్న పాఠశాలలకు ఇక పూర్తిస్థాయిలో హెచ్ఎంలు రానున్నారు. మున్సిపల్ పాఠశాలల్లో దాదాపు 17 ఏళ్లుగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 13 మున్సిపాలిటీలు, గుంటూరు, మంగళగిరి కార్పొరేషన్ల పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు దాదాపు 150 పైగా ఉన్నాయి. సబ్జెక్టు టీచర్ల కొరతతో విద్యా వలంటీర్లు లేదంటే ప్రాథమిక పాఠశాలల నుంచి ఎస్జీటీలను డిప్యూటేషన్‌పై నియమించి విద్యార్థులకు బోధన అందిస్తున్నారు. గుంటూరులో 11 ఉన్నత పాఠశాలలు ఉండగా పూర్తిస్థాయి హెచ్ఎంలు లేరు. మరోవైపు పీఈటీల కొరత కూడా మున్సిపల్ పాఠశాలలను వేధిస్తోంది. ఈ పరిస్థితుల్లో ఏటా ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు బోధన అందించేందుకు ఉపాధ్యాయులను వెతుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చింది అవసరమైన చోట ఉపాధ్యాయులను ఉద్యోగోన్నతులు కల్పించి పూర్తిస్థాయిలో నియమించుకునేలా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. గ్రేడ్ టూ హెచ్ఎం పోస్టులు కూడా భర్తీ కానున్నాయి. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు 9 మందికిపైగా పూర్తిస్థాయి హెచ్ఎంలు రానున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 190కి పైగా స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) పోస్టులు భర్తీ కానున్నాయి. అవసరమైన ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ పోస్టులు కూడా భర్తీ చేయనున్నారు. త్వరలో షెడ్యూల్ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు విద్యాశాఖ కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

విద్యాశాఖ మంత్రి లోకేశ్ చొరవ..

విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నారా లోకేశ్ తాను ప్రాతినిధ్యం వహించే మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉపాధ్యాయుల కొరత గురించి స్వయంగా తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయుల భర్తీకి ఆయన చొరవ చూపినట్లు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హైమారావు ఆంధ్రజ్యోతికి తెలిపారు. దాదాపు 2000పైగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలకు మంజూరు చేశారన్నారు.



నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం

ఆర్థిక స్వేచ్ఛ.. ఎప్పటికో?

- జీతాలు, బిల్లుల చెల్లింపులో జాప్యం
- మార్గదర్శకాల్లోనే మున్సిపాల్టీలకు అధికారాలు
- ఇప్పటికీ పాత పద్ధతిలోనే ఆర్థిక లావాదేవీలు
- రూపాయి ఖర్చుకు కూడా అనుమతి కోసం ఎదురుచూపు
- సీఎఫ్ఎంఎస్ విధానంతో మున్సిపాల్టీల్లో ఆర్థిక వెతలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నిధులు ఉన్నా.. మున్సిపాల్టీల్లో ఖర్చు చేసుకునే వెసులుబాటు లేదు. అత్యవసర పనులకు సైతం బిల్లులు చెల్లించే పరిస్థితి లేదు. ప్రజలు నుంచి ఆస్తి, నీటి, ప్రకటనల పన్నులను షాపింగ్ కాంప్లెక్సు లీజుల ద్వారా వచ్చే ఆదాయాలను మున్సిపాలిటీలు వసూలు చేస్తున్నా.. ఆ మొత్తాలపై అజమాయిషీ రాష్ట్ర ప్రభుత్వానిదే. పేరుకు పురపాలక సంఘం.. ప్రత్యేక పాలనా వ్యవస్థ ఉన్నా.. ఆర్థిక స్వేచ్ఛ మాత్రం లేదు. ప్రభుత్వం అనుమతి ఇస్తేనే ఉద్యోగులకు జీతాలు, ఇతర అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించే పరిస్థితి నెలకొంది. మున్సిపాల్టీలకు అధికారాలను కల్పించాలని ప్రభుత్వం సంకల్పించి మార్గదర్శకాలను విడుదల చేసింది. అయితే నెలలు గడుస్తున్నా ఈ మార్గదర్శకాలు అమల్లోకి రాలేదు. సీఎఫ్ఎంఎస్ విధానంతో మున్సిపాల్టీలు ఆర్థిక వెతలను ఎదుర్కొంటున్నాయి. పంచాయతీలకు గతంలో టీడీపీ ప్రభుత్వం ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కల్పించింది. దీంతో ప్రజలు చెల్లించే పన్ను, వివిధ గ్రాంట్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వ అజమాయిషీ లేకుండా అభివృద్ధి పనులకు వినియోగిం చుకునే అధికారం పంచాయతీలకు వచ్చింది. ఈ పరిస్థితి మున్సిపాల్టీలకు లేదు. దీంతో విద్యుత్ బిల్లులు, కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లింపులో జాప్యం జరుగుతోంది. ప్రతి బిల్లు అప్‌లోడ్ చేస్తే.. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి అనుమతి లభిస్తేనే సీఎఫ్ఎంఎస్‌లో ఆ బిల్లు పాసవుతుంది. ఈ ప్రక్రియ అమలులో జాప్యం జరుగుతోంది. మున్సిపాల్టీల్లో అత్యవసర పరిస్థితుల్లో తాగునీరు, పారిశుధ్య పనులు చేయాల్సి వస్తుంది. ఇందుకు సంబంధించి బిల్లుల చెల్లింపులోనూ జాప్యం జరుగుతుండటంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదని అధికారులు చెబుతున్నారు. సీఎఫ్ఎంఎస్ నుంచి మున్సిపాల్టీలను తప్పించేందుకు పలు ఆర్థికపరమైన అనుమతులు కావాలని, ఇందుకు సంబంధించిన ప్రక్రియ జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆర్థిక పరమైన స్వేచ్ఛ కోసం మున్సిపాల్టీలు మరికొంత సమయం వేచి ఉండాల్సిందేనని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. సీఎఫ్ఎంఎస్ నుంచి మున్సిపాల్టీ లకు విముక్తి కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలను వేగవంతం చేయాలని పురపాలకులు కోరుతున్నారు.

నాణ్యత లేకుంటే అధికారులపై చర్యలు

- నిర్వహణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి
- ప్రతి రెండు కిలోమీటర్లకు ఓ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను నియమించాలి
- నీటిపారుదల పనుల సమీక్షలో కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మే 15 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదలశాఖలోని పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఆపరేషన్ అండ్ నిర్వహణ పనులపై కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఆపరేషన్ అండ్ నిర్వహణ కింద 454 పనులకు రూ.12.59 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ నెల 10నే నీటిని నిలిపేసినందున కాల్వల్లో యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు. వర్షాలు ముందుగా వచ్చే పరిస్థితి ఉన్నందున పనులను నెలాఖరులోగా పూర్తి చేయాలని చెప్పారు. ఆయా పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. పనులకు సంబంధించి ప్రతిరెండు కిలోమీటర్లకు ఒక ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను నియమించాలని, వారిపై పర్యవేక్షకులుగా ఏఈలను నియమించాలన్నారు. కట్టలకు ఎక్కడ గండిపడితే అక్కడ విధులు నిర్వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. పనుల పరిశీలనకు ప్రత్యేకంగా కమిటీని నియమిస్తామని, ఎక్కడైనా లోపాలు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత ఏడాది సెప్టెంబరులో కేటాయించిన పనులు ఇంకా పూర్తి చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నెలాఖరులోగా పనులు పూర్తి చేయకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో నీటిపారుదలశాఖ ఎస్ఈ పి.వెంకటరత్నం, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, ఈఈలు ఎం.ప్రేమ్‌కుమార్, మురళికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేమూరులో 17న స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర

జిల్లాస్థాయిలో ఈ నెల 17న వేమూరులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. వేడిని తట్టుకోవడం అనే అంశంపై కార్యక్రమం జరుగుతుందన్నారు.



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకటమురళి



ఆర్టీఈలో.. 1904 సీట్లు

740 నమోదు.. 1155 మందికి అవకాశం

ఈ నెల 19వ తేదీతో ముగియనున్న గడువు

బాపట్ల, మే 15 (ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం(ఆర్టీఈ) కింద జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో 1904 సీట్లు కేటాయించారు. జిల్లాలో మొత్తం 225 ప్రైవేటు పాఠశాలలు ఉండగా ఆర్టీఈ ద్వారా 25 శాతం మంది విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్లు ఇవ్వాలి. అయితే ఈ ఏడాది 1వ తరగతిలో చేరేవారు ఇప్పటి వరకు 740 మంది మాత్రమే నమోదు చేసుకున్నారు. ఈ నెల 19వ తేదీ వరకు ఆర్టీఈ ప్రవేశాల నమోదుకు అవకాశం ఉందని, దీనిని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మర్రెడ్డి నాగిరెడ్డి తెలిపారు. ఉచిత సీటు పొందేందుకు తల్లిదండ్రులు సమీప పాఠశాలలో రిజిష్టర్ చేసుకోవాలని కోరారు. ఇంకా 1155 ఉచిత సీట్లు ఉన్నట్లు తెలిపారు.

మండలం	స్కూల్స్	సీట్లు	నమోదు
అద్దంకి	17	135	78
అమర్తలూరు	3	24	10
బాపట్ల	32	233	78
భట్టిప్రోలు	7	75	42
చెరుకుపల్లి	10	74	4
చినగంజాం	4	28	17
చీరాల	35	300	151
ఇంకొల్లు	8	88	32
జెపంగులూరు	2	2	7
కారంచేడు	1	9	5
కర్లపాలెం	3	45	23
కొల్లూరు	6	51	8
కొరిశపాడు	7	144	6
మార్టూరు	8	108	28
నగరం	4	28	0
నిజాంపట్నం	7	55	16
పర్చూరు	6	70	5
పిట్టలవానిపాలెం	9	56	16
రేపల్లె	21	169	183
సంతమాగులూరు	7	65	7
చుండూరు	5	31	7
వేమూరు	7	32	10
వేటపాలెం	15	82	27

ఫేస్ పే..! ముఖం చూపిస్తే డబ్బులిస్తాం

- అతిపెద్ద నెట్‌వర్క్ కలిగిన ప్రాంతీయ బ్యాంకుగా ఏపీజీ
- నాలుగు గ్రామీణ బ్యాంకుల విలీనంతో ఏర్పాటు
- గ్రామీణుల కోసం 'ఫేస్ పే' అందుబాటులోకి
- ముఖాన్ని స్కాన్ చేసి, నగదు విత్‌డ్రా చేసుకునే అవకాశం
- బ్యాంకు చైర్మన్ ప్రమోద్ కుమార్‌రెడ్డితో ముఖాముఖి

6

అమరావతి రాజధానిని అత్యద్భుతంగా నిర్మిస్తున్నాం

- ఈ నగరంలా దేశంలో మరొకటి ఉండదు
- ఇప్పటికే నిర్మాణం జరిగిన యూనివర్సిటీలు అమెరికాలో కంటే బాగున్నాయి
- డీఐఎల్ఆర్ఎంపీ వర్కుషాప్‌లో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

8



పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ని వీక్షిస్తున్న మంత్రులు పెమ్మసాని, అనగాని, స్పెషల్ సీఎస్ జయలక్ష్మి

సోలార్ ప్లాంట్ సెజ్‌కు సన్నాహాలు

భూసేకరణ కోసం నేడు రైతులతో సమావేశం

సంతమాగులూరు, బల్లికురవలో భూముల పరిశీలన



ఎస్ఎల్ గుడిపాడు సమీపంలో భూసేకరణ చేయనున్న భూములు

అద్దంకి/బల్లికురవ, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే మొట్టమొదటి సోలార్ ప్లాంట్ సెజ్‌ను జిల్లాలో ఏర్పాటుకు సన్నా హాలు జరుగుతున్నాయి. ఇప్పటికే సంతమాగులూరు మండలం కుందుర్తి, మామిళ్లపల్లి రెవెన్యూ పరిధిలో 1269 ఎకరాలు, బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడు రెవెన్యూ పరిధిలో 350 ఎకరాల భూమిని అధికారులు పరిశీలన చేశారు. ఆయా భూములకు సంబంధించి రైతులకు పరిహారం చెల్లించి భూసేకరణ చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఇచ్చే పరిహారం ధరను బట్టి రైతులు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కొంత భూమికి నీటి వసతి ఉండటంతో ఆయా భూముల రైతులు ఎక్కువ ధరను ఆశిస్తున్న ట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఆయా గ్రామాల ప్రజలకు కాలుష్యంపై అపోహలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం చీరాల ఆర్డీవో చంద్రశేఖరనాయుడు కుందుర్తి, మామిళ్లపల్లి, ఎస్ఎల్ గుడిపాడులలో రైతులతో అవగాహన సమావేశాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాలలో రైతులకు సమాచారం ఇచ్చి, దండోరా కూడా వేయించారు. సెజ్ ఏర్పాటైతే స్థానికంగా ఉపాధి అవకాశాలు బాగా పెరుగుతాయని యువత ఉత్సాహంగా ఉంది. అయితే భూమి కోల్పోతున్నందున బహిరంగ మార్కెట్ కంటే ఒకింత ఎక్కువ ధర కోసం రైతులు ఎదురు చూస్తున్నట్లు తెలిసింది. భూమి ఇచ్చేందుకు రైతులు ఇష్టపడి భూసేకరణ అడుగు ముందుకు పడితే రాష్ట్రంలోనే మొదటి సోలార్ ప్లాంట్‌కు అవసరమైన మెటీరియల్ స్థానికంగానే తయారు కావడంతో పాటు భారీ పరిశ్రమ ఏర్పాటు జరిగే అవకాశం ఉంది.



ఆదాయం ఉన్నా అభివృద్ధి సున్నా

- అద్దె భవనంలో కూచినపూడి మార్కెట్‌యార్డు
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు

8



స్వామి వారిని పెండ్లి కుమారునిగా అలంకరిస్తున్న అర్చకులు

వైకుంఠపురంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తెనాలి అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారిని పెండ్లి కుమారునిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకురారోహణ, ధ్వజారోహణ కార్యక్రమాలు ఘనంగా జరిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించి, పూజలు చేశారు. శుక్రవారం ఉదయం నిత్య హోమం, ఆలయ బలిహరణ, శేష వాహన గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆలయ ఈవో ఎం.అనుపమ, అర్చక సిబ్బంది ఉత్సవాలను పర్యవేక్షించారు.

గంజాయి కేసులో వారెంట్ ముద్దాయి అరెస్టు

తెనాలిరూరల్, మే15(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతన్న వారెంట్ ముద్దాయిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ ఆనంద్ వివరాల ప్రకారం.. పట్టణంలోని చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన గండికోట గోపీ అలియాస్ పవన్ కల్యాణ్‌పై రూరల్ పోలీస్ స్టేషన్‌లో 2021లో గంజాయి కేసు నమోదైంది. షరుతులతో కూడిన బెయిల్‌పై ఉన్న అతను 2023 నుండి కోర్టు వాయిదాలకు హాజరు కావడం లేదు. దీంతో మెజిస్ట్రేట్ నాన్ బెయిల్‌బుల్ వారెంట్ ఇవ్వడంతో గోపీని గురువారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరచారు. అతడికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో ఉపాధి శ్రామికుడి మృతి

పొన్నూరు టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): పని ప్రదేశంలో గుండెపోటుతో ఉపాధి శ్రామికుడు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని మన్నవగ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ అలీషా (60) గురువారం కూడా ఉపాధి పనులకు వెళ్లాడు. పని ప్రదేశంలోనే అలీషాకు గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. సమాచారం తెలుసుకున్న ఏపీవో సుభాషిణీ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబురావు హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లారు. స్థానిక వైద్య సిబ్బంది పరీక్షించి అలీషా మృతిచెందినట్లు నిర్ధారించారు.

ఫేస్ పే..! ముఖం చూపిస్తే డబ్బులిస్తాం!

- అతిపెద్ద నెట్‌వర్క్ కలిగిన ప్రాంతీయ బ్యాంకుగా ఏపీజీ
- నాలుగు గ్రామీణ బ్యాంకుల విలీనంతో ఏర్పాటు
- గ్రామీణుల కోసం 'ఫేస్ పే' అందుబాటులోకి
- ముఖాన్ని స్కాన్ చేసి, నగదు విత్‌డ్రా చేసుకునే అవకాశం
- బ్యాంకు చైర్మన్ ప్రమోద్ కుమార్‌రెడ్డితో ముఖాముఖి



బ్యాంక్ చైర్మన్ కే ప్రమోద్ కుమార్ రెడ్డి

దేశంలోనే అత్యధిక లాభార్జన కలిగిన, రాష్ట్రంలోనే అతిపెద్ద నెట్‌వర్క్ ఉన్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అవతరిస్తోంది. దాదాపు నాలుగు గ్రామీణ బ్యాంకుల విలీనంతో ఏర్పడిన ఈ ప్రాంతీయ బ్యాంకులో గ్రామీణులు, ముఖ్యంగా నిరక్షరాస్యుల కోసం అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చారు. పాస్‌బుక్, ఏటీఎం, యూపీఐతో పనిలేకుండా ఖాతాదారుని మొహాన్ని స్కాన్ చేసి, నగదు విత్ డ్రా చేసుకునే మెషిన్‌ను ఏర్పాటు చేశారు. దీనంతటి వెనుక బ్యాంకు చైర్మన్ కె.ప్రమోద్ కుమార్ రెడ్డి కృషి ఉంది. బ్యాంకు సాధిస్తున్న ప్రగతి, నూతన సేవలపై ఆంధ్రజ్యోతి ఆయనతో ముచ్చటించింది.

- (గుంటూరు- ఆంధ్రజ్యోతి)

● ఆంధ్రజ్యోతి: బ్యాంకుల విలీనం ఎందుకు?

చైర్మన్: నిన్నటి దాకా చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులు సేవలు అందించేవి. వాటన్నింటినీ విలీనం చేయడం ద్వారా బ్యాంకుల సామర్థ్యాన్ని పెంచవచ్చు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందివచ్చు. అందుకోసమే విలీనం చేశాం. ఈ బ్యాంకుల విలీనం చేసి, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మార్చారు. బ్యాంకు ప్రధానకార్యాలయం గుంటూరులోనే ఏర్పాటు చేశాం.

● ఆంధ్రజ్యోతి: రాష్ట్రంలోనే పెద్ద నెట్‌వర్క్ ఉన్న గ్రామీణ బ్యాంకుగా చెప్పవచ్చా?

చైర్మన్: నాలుగు బ్యాంకుల విలీనం తర్వాత రాష్ట్రంలోని అతిపెద్ద ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు నెట్‌వర్క్‌గా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అవతరించింది. రాష్ట్ర జనాభా 5.2 కోట్లు కాగా, అందులో 23 శాతం మంది మా బ్యాంకులోనే ఖాతా కలిగి ఉన్నారు. రాష్ట్రంలో 1.27 కోట్ల మంది ఖాతాదారులు ఉన్నారు. ప్రస్తుతం 1,351 బ్రాంచులతో కమర్షియల్ బ్యాంకులకు దీటుగా రాష్ట్రంలో మూడో అతిపెద్ద నెట్‌వర్క్‌గా ఉన్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 167 ఏటీఎంలు ఉన్నాయి. బ్యాంకింగ్ కరెస్పాండెన్స్ విధానం ద్వారా 3,029 పాయింట్లలో ఖాతాదారులకు సేవలు అందజేస్తున్నాం.



ఫేస్ పే మిషన్..

● ఆంధ్రజ్యోతి: సాంకేతికంగా బ్యాంకు పురోగతి ఏమిటి?

చైర్మన్: బ్యాంకులో అందుబాటులోకి తెచ్చిన సాంకేతికత గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఎందుకంటే ఇప్పటి వరకు కమర్షియల్ బ్యాంకులు కూడా అందుబాటులోకి తీసుకురాని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మనం అందుబాటులోకి తెస్తున్నాం. బ్యాంకు పాస్‌బుక్, ఏటీఎం, ఆధార్, యూపీఐ యాప్ వేటితో సంబంధం లేకుండా ఖాతాదారుడు తనకు కావాల్సిన నగదును విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని కల్పించాం. ఎందుకంటే గ్రామీణ ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్, ఏటీఎం, యూపీఐ వినియోగంపై అంత అవగాహన ఉండదు. పైగా ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్లంటే ప్రజల్లో భయం ఉంటుంది. పోనీ బ్యాంకుకు వెళదామా అంటే అక్కడ పెద్ద క్యూ ఉంటుంది. అందుకని ఖాతాదారు బ్యాంకంటేనే భయపడే పరిస్థితి ఉంటుంది. అలాంటి వారు ఒట్టి చేతులతో వెళ్లి నగదు విత్‌డ్రా చేసుకునేలా 'ఫేస్ పే' సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చాం.

● ఆంధ్రజ్యోతి: ఫేస్ పే అంటే ఏమిటీ? దాన్ని ఎలా వినియోగించుకోవాలి.

చైర్మన్: అన్ని బ్యాంకులు ఏటీఎం, యూపీఐ వంటి సేవలు అందిస్తున్నాయి. వాటితో పాటు మనం ఫేస్ పే సదుపాయాన్ని తెచ్చాం. బ్యాంకులో నగదు విత్‌డ్రా చేసుకోవాలనుకునేవారు విత్ డ్రా ఫామ్ నింపడం, క్యూలో నిలబడటం వంటి సమస్యలను ఫేస్ పే లేకుండా చేస్తుంది. ఖాతాదారు ఫేస్ పే మిషన్ ఎదురుగా నించుంటే అది అతడి ముఖాన్ని స్కాన్ చేసుకుంటుంది. ఫొటో తీసుకుని సరిపోల్చుకుంటుంది. ఓకే అయిన తర్వాత ఖాతాదారు పేరు, పాస్‌బుక్ వివరాలు, ఖాతాలో నిల్వ మొత్తం తెలుగులో ఖాతాదారుకు వినిపిస్తుంది. విత్‌డ్రా సేవను చెబుతుంది. ఖాతాదారు తాను విత్‌డ్రా చేసుకోదల్చిన మొత్తాన్ని నమోదు చేశాక, దాన్ని కన్ఫార్మ్ చేసుకోవడానికి మరోసారి వినిపిస్తుంది. ఖాతాదారు ఓకే చేస్తే ఏటీఎంలో లాగా నగదు బయటకు వస్తుంది. నగదు లేకపోతే ఓచర్ వస్తుంది. ఆ ఓచర్ తీసుకుని బ్యాంకు సిబ్బందికి ఇస్తే వారు వెంటనే డబ్బు ఇస్తారు.

● ఆంధ్రజ్యోతి: లిమిట్ ఎంత వరకూ?

చైర్మన్: ప్రస్తుతం రూ. 25వేల వరకూ ఫేస్ పే ద్వారా విత్‌డ్రా చేసుకోవచ్చు. మున్ముందు మరింత పెంచుతాం. దాంతోపాటు నగదు డిపాజిట్, ఇతర సదుపాయాలన్నీ అందుబాటులోకి తీసుకువస్తాం.

● ఆంధ్రజ్యోతి: ఎవరైనా ఖాతాదారు ఫొటో తెచ్చి మోసం చేయొచ్చు కదా?

చైర్మన్: అలా జరిగే అవకాశమే లేదు. ఫొటోలు పెడితే మిషన్ తీసుకోదు. అలాంటి మోసాలు జరగకుండా ఉండడానికి 'లైవ్‌నెస్ డిటెక్షన్'ను అమర్చాం. సజీవమైన మనిషి ఉంటేనే మిషన్ తీసుకుంటుంది.

● ఆంధ్రజ్యోతి: ఇలాంటివి ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారు?

చైర్మన్: అన్ని చోట్లకు వీటిని అందుబాటులోకి తెస్తాం. ప్రస్తుతం పైలట్ ప్రాజెక్టుగా పదిచోట్ల ఏర్పాటు చేశాం. గుంటూరు జిల్లాలో బ్రాడీపేట, మంగళగిరి, నంబూరు, యనమదలలో, పల్నాడు జిల్లాలో నరసరావుపేట, మోర్జంపాడు, కారంపూడి, పులిపాడు, తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం, ఏలూరు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశాం. గుంటూరు బ్రాడీపేటలో ఏర్పాటు చేసిన ఫేస్ పే మిషన్‌ను నాబార్డ్ సీజీఎం ఎం.ఆర్. గోపాలం ప్రారంభించారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



పురపాలక శాఖ అడిషనల్ డైరెక్టర్ అనురాధకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయం ఉద్యోగ సంఘం నాయకులు

గుంటూరు సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వార్డు సచివాలయాల ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్, ప్రధాన కార్యదర్శి శిస్టు నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు..గురువారం పురపాలక శాఖ అడిషనల్ డైరెక్టర్ చల్లా అనురాధను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం వార్డు సచివాలయ ఉద్యోగుల ఉద్యోగోన్నతికి ఇచ్చిన జీవో నంబరు 523ను రద్దుచేయాలని కోరారు. ఉద్యోగోన్నతి సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్, అంతకంటే ఎక్కువ ఉండే విధంగా రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్యదర్శులకు వివిధ సంక్షేమ శాఖల్లో ఉద్యోగోన్నతులకు అవకాశం ఇవ్వాలని, రెగ్యులర్ విధానంపై మెప్మాలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్స్, కమ్యూనిటీ ఆర్గనైజర్లుగా నియమించాలని, అర్హులకు కార్మిక శాఖలో అసిస్టెంట్ లేబర్ వెల్ఫేర్ అధికారులుగా అవకాశం కల్పించాలని ఇలా పలు డిమాండ్లను వివరించారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని డైరెక్టర్ చల్లా అనురాధ వారికి హామీ ఇచ్చారు. సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పార్థా మధు, విశాఖపట్నం జిల్లా కార్యదర్శి పార్థసారథి, కాకినాడ జిల్లా నాయకులు లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



నాటిక పోటీలకు సిద్ధమైన వేదిక

నేటి నుంచి ఆహ్వాన నాటిక పోటీలు ప్రారంభం

చిలకలూరిపేట, మే15 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట సీఆర్ క్లబ్, చిలకలూరిపేట కళాపరిషత్ సంయుక్తంగా శుక్రవారం నుంచి మూడు రోజులపాటు తెలుగు రాష్ట్రాల స్థాయిలో 9వ ఆహ్వాన నాటిక పోటీలు స్థానిక సీఆర్ క్లబ్ ఓపెన్ థియేటర్‌లో నిర్వహిస్తున్నారు. ఇందుకోసం సీఆర్ క్లబ్ కళా వేదికను సిద్ధం చేశారు. రాత్రి నాటిక పోటీలను స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభిస్తారు. అనంతరం హైదరాబాద్ కళాంజలి వారి రైతే రాజు, చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్ వారి మా ఇంట్లో మహాభారతం, హైదరాబాద్ యవభేరి థియేటర్స్ వారి నా శత్రువు నాటికల ప్రదర్శన జరుగుతుంది. ఈ కార్యక్రమాలలో స్థానిక సీఆర్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి కాంతయ్య, పావులూరి శ్రీనివాసరావు, కోశాధికారి మక్కెన నరసింహారావు పాల్గొంటారు.

నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు రూ.18.50 కోట్ల పెట్ స్కాన్

గుంటూరు మెడికల్, మే 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో అత్యాధునిక పెట్ స్కాన్ మెషిన్ అందుబాటులోకి వచ్చింది. దీని విలువ సుమారు రూ.18.50 కోట్లు. పలు రకాల క్యాన్సర్ వ్యాధుల చికిత్సలో, వ్యాధి నిర్ధారణలో ఈ పరికరం ఎంతో కీలకం. రాష్ట్ర ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రికి పెట్ స్కాన్‌ను అందజేయడం ఇదే మొదటిసారి. ప్రస్తుతం ఈ పరికరాన్ని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ఇన్‌స్టాల్ చేస్తున్నారు. ట్రయల్స్ పూర్తి చేసి మరో నెల రోజుల్లో రోగులకు అందుబాటులోకి తెస్తామని జీజీహెచ్ అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రైవేటు క్యాన్సర్ హాస్పిటల్స్‌లో పెట్ స్కాన్‌కు రూ.25 వేలు, పేదలకు కన్‌సెషన్ కింద కనిష్ఠంగా రూ.17 వేల వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని చారిటీ ఆసుపత్రుల్లో రూ.8 వేలకు ఈ పరీక్ష చేస్తున్నారు. జీజీహెచ్‌లో పెట్ స్కాన్ పరీక్షలు ఉచితమా? నామమాత్రపు రుసుం తీసుకుంటారా అనేదానిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.



నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో పెట్ స్కాన్



విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందజేస్తున్న రాంబాబు నాయక్

పదిలో మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేత

బొల్లాపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజానాయక్ తండాకు చెందిన డాక్టర్ జర్రావత్ రాంబాబు నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 40వ పుట్టిన రోజు సందర్భంగా వినుకొండ - మాచర్ల నియోజకవర్గాల్లో ఐదు వందలకు పైగా మార్కులు సాధించిన 10వ తరగతి విద్యార్థులకు స్కాలర్ షిప్‌ల పంపిణీ గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన మూడావత్ రమణానాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాంబాబు నాయక్ ఫౌండేషన్ చైర్మన్, సువర్ణ కుటీర డెవలపర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాంబాబు నాయక్ మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చదువుపై శ్రద్ధ పెట్టి తల్లిదండ్రులను సంతోష పరచాలని సూచించారు. లక్ష్యం లేని విద్యార్థి ఏదీ సాధించలేడని, ముందు చూపు ఉన్నవాడు ముందుకెళ్తాడన్నారు. నాయక్ 40వ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. మాచర్ల, వినుకొండ నియోజకవర్గాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 60 మంది విద్యార్థులకు రూ.5వేలు చొప్పున స్కాలర్‌షిప్స్ అందజేశారు. ఐదేళ్లుగా సేవలు అందిస్తున్న రాంబాబు నాయక్‌ను పలువురు ఈ సందర్భంగా అభినందించారు. మేనేజింగ్ డైరెక్టర్ మర్రి సత్యనారాయణ, ప్రణవి గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ విష్ణుమూర్తి నాయక్, టీడీపీ రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ వెంకటరావు, టీడీపీ రాష్ట్ర చైర్మన్ యువత రామకృష్ణ, ఓవర్సీస్ ఎండీ అనిల్ చౌదరి, సువర్ణ కుటీర్ సీఈవో బాలూ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం గుంటూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలకృష్ణ నాయక్, జనరల్ సెక్రటరి రామ్‌నాయక్, కొండా నాయక్, ఏడుకొండలు నాయక్, ఎల్ఐసీ డెవలప్‌మెంట్ అధికారి బర్మానాయక్, డాక్టర్ కె.సంధ్యా బాయి, జిల్లా ఎస్టీ సెల్ నాయకుడు హనుమా నాయక్ పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి ఉరిశిక్ష

నరసరావుపేట కోర్టు సంచలన తీర్పు



తన్నీరు అంకమ్మరావు

నరసరావుపేట లీగల్, మే 15, (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని 2023 మే 4న జరిగిన హత్య కేసుకు సంబంధించి నిందితుడు తన్నీరు అంకమ్మరావు అలియాస్ ముళ్ల పందికి ఉరిశిక్ష విధిస్తూ గురువారం స్థానిక పదమూడో అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి డాక్టర్ నేతి సత్యశ్రీ సంచలన తీర్పు ఇచ్చారు. ఇందుకు సంబంధించి ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాలు.. స్థానిక లాల్ బహదూర్ కూరగాయల మార్కెట్ వద్ద షేక్ సలీమా(52) అనే మహిళ దారుణంగా హత్యకు గురైంది. తొలుత గుర్తుతెలియని మహిళగా కేసు నమోదు చేసిన పోలీసుల విచారణలో ఆమె పట్టణంలోని ఎస్ఆర్కేటీ ప్రాంతానికి చెందిన మహిళగా తేల్చారు. దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలను పరిశీలించగా నిందితుడు తన్నీరు అంకమ్మరావు సలీమాను హతమార్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పై విధంగా కోర్టు తీర్పు ఇచ్చింది. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి నిర్వహించారు. అప్పటి నరసరావుపేట మొదటి పట్టణ సీఐ ఆకుల అశోక్‌కుమార్ కేసు దర్యాప్తు చేశారు. అంకమ్మరావుపై మరో రెండు హత్య కేసులు కూడా ఉన్నాయి.

మినీ మహానాడులు నిర్వహించాలి : కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు బూత్ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు మినీ మహానాడులను నిర్వహించాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో ఈ మినీ మహానాడులు వైభవంగా నిర్వహించాలని ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, టీడీపీ ముఖ్య నాయకుల సూచించారు. రాష్ట్రాన్ని దుర్మార్గంగా పరిపాలించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కబంధ రాక్షస హస్తాల నుంచి విడిపించేందుకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు చేసిన కృషి, పోరాటం ఫలితంగా బీజేపీ, జనసేన, తెలుగుదేశం పార్టీల కలయికతో అద్భుతమైన విజయాన్ని సాధించిన సందర్భంగా ఈ మినీ మహానాడులను ఘనంగా నిర్వహించాలని కోరారు. పార్టీ బలోపేతం, పరిపాలన పరంగా తీసుకోవాల్సిన నిర్ణయాలు, మార్గదర్శకమైన మార్పులపై నిర్ణయాత్మకమైన సలహాలు అందించాలన్నారు.

చెరువులో పడి గొర్రెల కాపరి మృతి

పెదనందిపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పమిడివారిపాలేనికి చెందిన గొర్రెలకాపరి ఇరుపన కోటేశ్వరరావు(38) చెరువులో పడి గురువారం మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం బుధవారం కోటేశ్వరరావు గొర్రెలను పొలాలకు తోలుకొని వెళ్లాడు. మందను తన భార్యకు అప్పగించి.. ఇంటికి వచ్చి గేదెలను పొలానికి తోలుకొని వెళ్తుండగా అవి చెరువులోకి వెళ్లాయి. వాటిని బయటకు తోలే క్రమంలో ప్రమాదవశాత్తూ కాలుజారి చెరువులో కోటేశ్వరరావు పడిపోయాడు. ఎంతసేపటికి ఇంటికి రాకపోడంతో, ఫోన్ స్విచ్‌ఆఫ్ అయ్యి ఉండడంతో కుటుంబ సభ్యులు అతని కోసం వెతికారు. చెరువులో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధుపవన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

దుర్గి, మే 15 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఆత్మకూరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుప్పాల అయ్యపురెడ్డి (42) తనకున్న రెండు ఎకరాల సొంత పొలంతోపాటు మరో ఆరు ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి సాగు చేశారు. మూడేళ్లుగా గిట్టుబాటు ధర, దిగుబడి రాకపోవడంతో రూ. 15 లక్షల దాకా అప్పులయ్యాయి. అప్పుల తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్థాపంతో గురువారం తన పొలంలో పురుగు మందు తాగాడు. పక్క పొలం రైతులు గమనించి అయ్యపురెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు పొలం వద్దకు చేరుకొని అయ్యపురెడ్డిని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై రాత్రి 10 గంటల వరకు పోలీస్‌స్టేషన్లో ఎటువంటి కేసు నమోదు కాలేదు.

ట్రాక్టర్ బోల్తా.. 25 మందికి గాయాలు

నూజెండ్ల, మే 15 (ఆంధ్రజ్యోతి) : నూజెండ్ల మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన 25 మంది గురువారం వినుకొండ మండలం అందుగుల కొత్తపాలెంలో జరిగిన సంస్మరణ కార్యక్రమాల్లో పాల్గొని, తిరిగి వస్తున్నారు. ట్రాక్టర్ అదుపు తప్పి పడి పోవడంతో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా మరో 19 మందికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన నారిశెట్టి త్రిపుర సుందరరావు, మన్నెం చిన్న కోటయ్యను గుంటూరు తరలించగా నాగులపాటి శ్రీను, పెద రంగయ్య, కూచిపూడి రంగయ్య, నాగులపాటి కోటయ్య వినుకొండ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీకి తరలిరండి

● ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, మే 15 (ఆంధ్రజ్యోతి) : భారత్‌జవాన్లకు మద్దతుగా ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీని శుక్రవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. చీలురోడ్డుసెంటర్ నుంచి పాతబస్టాండ్ మీదగా జమ్ములపాలెం ఆర్‌వోబీ అంబేద్కర్ సర్కిల్ వరకు నిర్వహించే ఈ ర్యాలీలో ప్రజానీకం పెద్దఎత్తున జాతీయ జెండాలు పట్టుకొని పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. రాజకీయపార్టీలకు అతీతంగా జరిగే ఈ ర్యాలీలో వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, విద్యార్థులు, ఉద్యోగులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

రూ.7లక్షల నిధులతో సీసీ రహదారి శంకుస్థాపన

రేపల్లె, మే 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెలుగుయువత అధ్యక్షుడు కొలసాని రాము అన్నారు. గురువారం నిజాంపట్నం మండలం పిల్లలవారిపాలెంలో సీసీ రహదారికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిపై రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టి సారించారని నియోజకవర్గంలోని గ్రామాల రహదారి కోసం కోట్లాదిరూపాయల నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రూ.7లక్షలతో గ్రామంలో సీసీ రహదారి నిర్మిస్తున్నామని అన్నారు. అనంతరం చెక్కావారిపాలెం గ్రామానికి చెందిన కట్టుపల్లిప్రసాద్ ప్రమాదశాత్తు కాల్వలో పడి మరణించటంతో మంత్రి అనగాని సత్యప్రసాద్ అందించిన ఆర్థికసాయాన్ని వారి కుటుంబసభ్యులకు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొర్రా సురేంద్ర, రాగం కల్యాణ్, అరవ శంకరరావు, ఉప్పాల నాగయ్య, నల్లపాటి యల్లయ్య, మోర్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గాలుమార్గంలో అనధికారిక వసూళ్లు

● నలుగురిపై కేసు

కొల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానదిలో అనధికారికంగా వేసిన గాలు మార్గంలో వాహనదారుల నుంచి టోల్ రుసుం చేస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ అర్జునరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గాజుల్లంక వద్ద కృష్ణానదిలో శ్రీకాకుళం - గాజుల్లంక మధ్య ప్రజల రాకపోకల కోసం గాజుల సోమేశ్వరరావు, సిబ్బి అంజనేయులు, గాజుల మహేష్, కొల్లా దివాకర్‌లు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండా నదిలో గాలు మార్గం ఏర్పాటు చేసి వాహనదారుల నుంచి బలవంతంగా టోల్ రుసుం వసూలు చేస్తున్నట్లు గాజుల్లంక వీఆర్వో షేక్ నూర్జహాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

డోర్‌టూ డోర్ సర్వే చేపట్టాలి

● కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల, మే15 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలో ఆస్తిపన్ను చెల్లిస్తున్న అన్ని భవనములు, ఖాళీస్థలాలను డోర్‌టూ డోర్ సర్వే నిర్వహించి ఏవైతే భవనాలు ఆస్తి పన్ను పరిధిలోకి రాకుండా ఉన్నాయో వాటిని గుర్తించేందుకు, పన్నుచెల్లించాల్సిన దానికన్న తక్కువ చెలిస్తున్న భవనాలు గురించి తెలుసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. ఈ విషయమై గురువారం మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూసిబ్బందితో ఆయన సమావేశం అయ్యారు. అండర్ అసెస్‌మెంట్, అన్ ఆసెస్‌మెంట్‌లను గుర్తించి వాటిన్నిటిని పన్ను పరిధిలోకి తీసుకొచ్చేలా అడ్మిన్ సెక్రటరీలంతా సర్వేచేయాలన్నారు. సమావేశంలో ఆర్‌వో అబ్దుల్ జబ్బార్, ఆర్‌ఐలు శివరామకృష్ణ, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీపెద్దింటమ్మ కొలుపులు



ప్రత్యేక అలంకరణలో శ్రీపెద్దింటమ్మతల్లి

కర్లపాలెం, మే 15(ఆంధ్రజ్యోతి): కర్లపాలెం మండల నల్లమోతువారిపాలెం గ్రామదేవత శ్రీపెద్దింటమ్మ కొలుపులు గురువారంతో రెండోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి సముద్రస్నానాలు, మంగళమేళాలు, కనకతప్పెట్లతో చద్ది నైవేద్యాలు, ఘటం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కుంటా రత్నబాబు, మాడా శ్రీనివాసరావు, సూరినేని మురళికృష్ణ, మర్రి అశోక్, గరిగంటి శ్రీనివాసరావు, గుర్రాల అప్పారావు, తాండ్ర శ్రీనివాసరావు, తోట ఏసురాజు, ఏమినేని తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి రైతుల సమస్యలు



సమావేశంలో పాల్గొన్న గోవాడ డీసీ రాధాకృష్ణమూర్తి తదితరులు

అమృతలూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని గోవాడ డీసీ ఎం రాధాకృష్ణమూర్తి తెలిపారు. గురువారం మండలపరిధిలోని ఇంటూరులో 291 సాగునీటి వినియోగదారుల సంఘం సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు బోరుగడ్డ శామ్యూల్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి గోవాడ డీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసకువచ్చారు. స్పందించిన ఆయన వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గోవాడ ఉప డీసీ సత్యనారాయణ, ఏఈ విజయబాబు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డొంక రోడ్ల అభివృద్ధిపై రైతుల అసంతృప్తి

● సర్వే ప్రకారం రహదారి నిర్మాణం జరగట్లేదని ఆరోపణ

కొల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : డొంక రోడ్ల అభివృద్ధిపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సర్వే ప్రకారం రహదారి నిర్మాణం జరగడం లేదని ఆరోపిస్తున్నారు. కొల్లూరులోని లాకు సెంటర్ నుంచి క్రాప వెళ్లే కైలాసపురం డొంక రోడ్డును రూ.కోటి 50 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. డొంక రోడ్డు నిర్మాణంలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాల్వలపై మురుగునీరు వెళ్లేందుకు అవరోధంగా ఉన్న కట్టలను సైతం ఈ పనుల్లో భాగంగా తొలగింపజేస్తుండగా కొంత మంది రైతులు మాత్రం వాటిని తీయనీయ్యకుండా అడ్డుపడటంతో గుత్తేదారు కట్టలను మినహాయించి ఇతర పనులను సాగిస్తున్నాడు. అదే ప్రాంతంలో ఉన్న ఇతర రైతులు కట్టలను తొలగించకపోవడం వల్ల వర్షాకాలంలో పొలాల్లో ఉన్న మురుగునీరు బయటకు పోయే మార్గం లేక పంట పొలాలు ముంపునకు గురవుతాయని చెబుతున్నారు. పొలాల్లోకి వెళ్లేందుకు మురుగు కాల్వలపై పోసిన కట్టల స్థానంలో పైపులు వేసుకుంటే మురుగునీరు వెళ్లేందుకు అడ్డంకి లేకుండా ఉంటుందని ఆ దిశగా ఎవరూ ఆలోచన చేయకుండా కట్టలను మాత్రం తొలగించడం లేదని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు డొంక రోడ్డు, మురుగు కాల్వలపై అడ్డుగా ఉన్న కట్టలను పరిశీలించి వాటిని తొలగించి రైతులకు భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా చూడాలని మొరపెట్టుకుంటున్నారు.



అభివృద్ధి చేస్తున్న కొల్లూరులోని కైలాసపురం డొంక



మురుగు కాల్వపై నుంచి పొలంలోకి వెళ్లేందుకు కట్టలు పోసి పూడ్చివేసిన చిత్రం

జీవనోపాధి కల్పనతో మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

● మేఘమథనం కార్యక్రమంలో కలెక్టర్ జె.వెంకటమురళి



సభలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మే15 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల్లోని 30వేల కుటుంబాలకు జీవనోపాధి కల్పించి, వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేయడమే లక్ష్యమని కలెక్టర్ జె.వెంకటమురళి పేర్కొన్నారు. పొదుపు మహిళల జీవనోపాధి, ఆర్థికాభివృద్ధి అంశాలపై మేఘమథనం కార్యక్రమం గురువారం స్థానిక సాయిరాం గ్రాండ్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. డీఆర్డీఏ, మెప్మా క్షేత్రస్థాయి పట్టణ, గ్రామ సంఘాల నాయకులు పాల్గొన్నారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని, జ్యోతిప్రజ్వలన చేసి సభలో మాట్లాడారు. పొదుపు మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను చేయాల్సిన బాధ్యత క్షేత్ర స్థాయి సిబ్బందిపై ఉందని చెప్పారు. వారంతా నికర ఆదాయం సాధించేలా చైతన్యపర్చాలని సూచించారు. ప్రభుత్వం వెచ్చిస్తున్న నిధులు మహిళలకు చేరువయ్యేలా సహకరించాలని కలెక్టర్ కోరారు. బాపట్ల జిల్లాలో 33,390 పొదుపు సంఘాలు ఉండగా అందులో 4 లక్షల కుటుంబాలు సభ్యులుగా ఉన్నాయని తెలిపారు. అందులో ఈ ఏడాది 30 వేల కుటుంబాల జీవన స్థితిగతులను మార్చడానికి కార్యోన్ముఖులు కావాలన్నారు. మహిళలు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి బాపట్ల జిల్లా వేదికగా మారాలన్నారు. పశుదాణా ఉత్పత్తికి నామమాత్రపు లీజుతో మహిళలకు ప్రభుత్వం భూమి లీజుకిస్తుందని ప్రకటించారు. సూర్యఘర్ పథకం ద్వారా జిల్లాలో 60 వేల గృహాలకు సౌర విద్యుత్ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని జిల్లా పాలనాధికారి స్పష్టం చేశారు. ఇందుకు దరఖాస్తు చేసుకున్న వెంటనే యూనిట్ ఏర్పాటు చేస్తారని తెలిపారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు స్థాపిస్తే మహిళలు ఆర్థికంగా మరింత మెరుగుపడతారని చెప్పారు. పీ4 విధానంలో భాగంగా 62వేల బంగారు కుటుంబాలు జిల్లాలో ఉన్నాయని తెలిపారు. డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు పొదుపు మహిళలకు హామీ లేని రుణాలు అందించడానికి ప్రభుత్వం ముందుకొచ్చిందని చెప్పారు. వివిధ పథకాల రాయితీలపై అవగాహన స్టాల్స్‌ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించే గోడ ప్రతులను కలెక్టర్ విడుదల చేశారు. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ద్రాక్షవల్లి, సీపీడీసీఎల్ ఎస్ఈ ఆంజనేయులు, ఎల్‌డీఎం శివకృష్ణ, మెప్మా పీడీ పి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలు ఉండరాదు

● సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మర్రెడ్డి నాగిరెడ్డి

బాపట్ల, మే 15 (ఆంధ్రజ్యోతి) : బడి బయట పిల్లలు ఉండరాదని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మర్రెడ్డి నాగిరెడ్డి తెలిపారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు వెళ్లేవిధంగా చూడాలని ఆయన కోరారు. ఈ విషయమై గురువారం ఐసీడీఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాగిరెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు పాఠశాలలో చేరేవిధంగా చూడాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఒకటో తరగతి విద్యార్థులకు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు.. ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారికి ఉచిత విద్య అందుతుందన్నారు. కాబట్టి అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు సీడీపీవోలు, సూపర్‌వైజర్‌లు ప్రజలకు అవగాహన కల్పించి ఉచిత సీట్‌లు పొందే విధంగా రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ఈ విషయంలో మండల విద్యాశాఖాధికారులు, సీఆర్పీలు చొరవచూపి అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల ఆర్థిక స్థితిగతులను తెలుసుకొని వారితో రిజిస్ట్రేషన్ చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ రాదా మాధవి, డిస్ట్రిక్ కోఆర్డినేటర్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌కు మరమ్మతులు



ప్రొక్లెయిన్ సాయంతో రేపల్లె మెయిన్ డ్రెయిన్ మరమ్మతులు చేస్తున్న దృశ్యం

వేమూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని భట్టిప్రోలు, రేపల్లె ప్రధాన మురుగు కాల్వలను రైతు సంఘాల సూచనల మేరకు మరమ్మతు పనులు చేపట్టారు. భట్టిప్రోలు కాల్వ పరిధిలో కొల్లూరు మండలం తాడిగిరిపాడు నుంచి వేమూరు వరకు రెండు కి.మీ దూరం, రేపల్లె కాల్వ పరిధిలో పెరవలి నుంచి చంపాడు వరకు ఆరున్నర కి.మీ దూరం వరకు గట్లు బలోపేతం చేయడంతో పాటు కాల్వల్లో పెరిగిన తూటికాడ, ఇతర చెట్లతో పాటు గ్రామాల నుంచి నీటి ప్రవాహానికి కొట్టుకు వచ్చిన వ్యర్థ పదార్థాలను ప్రొక్లెయిన్ సాయంతో తొలగించారు. ప్రభుత్వం నుంచి సంబంధించిన పనుల నిమిత్తం రూ.15 లక్షలు విడుదలైనట్లు ప్రాంతీయ ఏఈ చక్రవర్తి నాయక్ తెలిపారు. ఇటీ వల స్థానిక ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు నిర్వహించిన సమీక్ష లో ఆయన సూచనల మేరకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లతో వాహనదారులకు ఇబ్బందులు



కొల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇసుకను ఉచితం చేయడంతో కొల్లూరు మండలంలోని కృష్ణానది వెంబడి ఉన్న గ్రామాల నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్లు ఇసుక రవాణా చేస్తున్నాయి. ఇసుక రవాణాలో కనీస నిబంధనలు పాటించకపోవడంతో ట్రాక్టర్ వెనుక వచ్చే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాక్టర్‌లలో లోడు చేసిన ఇసుకపై పట్టా కప్పి ఇసుక గాలికి లేవకుండా చేయాల్సి ఉన్న ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులు నిర్లక్ష్యంగా రవాణా చేస్తుండటం, గమ్యస్థానం చేరే వరకు ట్రాక్టర్‌లోని ఇసుక రేణువులు గాలికి వెనుక వస్తున్న వాహనదారుల కళ్లలో పడుతుంది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిబంధనలు పాటించని ఇసుక ట్రాక్టర్లను నియంత్రించాల్సిన పోలీసు శాఖాధికారులు కూడా చూసి చూడనట్లు వదిలి వేస్తున్నారు. పోలీసుశాఖ ఇసుక ట్రాక్టర్లపై దృష్టి సారించి జరిమానాలు విధిస్తే నిబంధనలు అమలు అవుతాయని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.

మూతపడ్డ గ్రంథాలయం



చావలిలో మూతపడ్డ గ్రంథాలయం

వేమూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేజర్ గ్రామమైన చావలిలో జిల్లా గ్రంథాలయ సంస్థ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న గ్రామీణ గ్రంథాలయం మూతపడి ఆరేళ్లయింది. అక్కడ పని చేసే అధికారి మృతి చెందిన తరువాత మరొక ఉద్యోగిని నియమించే విషయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీంతో పూర్తిగా గ్రంథాలయం మూతపడటంతో పాటు అందులోని విలువైన పుస్తకాలు చెదలు పట్టి దెబ్బతిన్నాయి. దాతలు దాతృత్వ గుణంతో గ్రంథాలయానికి రాసి ఇచ్చిన భవనం కూడా దెబ్బతింటుంది. 6800 మంది జనాభా ఉన్న గ్రామంలో గ్రంథాలయం మూతపడటంపై పాఠకులు ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. చావలి గ్రామస్థులే కాకుండా పెరవలి, పెరవలిపాలెం మైనర్ గ్రామాల నుంచి కూడా పాఠకులు గ్రంథాలయానికి వచ్చి దిన, మాస, పక్ష పత్రికలతో పాటు పురాతనమైన పుస్తకాలను చదివేవారు. సొంత భవనం ఉండి దశాబ్దాల కాలం నుంచి కొనసాగుతున్న గ్రంథాలయాన్ని తెరిపించాలని పాఠకులు కోరుతున్నారు.

అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి : జీ చార్వాక

బాపట్ల, మే 15 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరు కృషి చేయాలని ఏఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక కోరారు. అంబేద్కర్ జయంత్యుత్సవాల ముగింపు కార్యక్రమాన్ని 12వవార్డు వెంగళ్‌విహార్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి చార్వాక అధ్యక్షత వహించి మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం రాజ్యాంగం రచించారన్నారు. అంబేద్కర్ ఆలోచన విధానాలను అనుగుణంగా నడుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా సంచారజాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చల్లా రామయ్యను సన్మానించారు.

సాల్వేషన్ ఆర్మీ సెంట్రల్ కోర్ ఆధ్వర్యంలో వీబీఎస్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న చర్చి సభ్యులు, సండే స్కూల్ విద్యార్థులు

బాపట్ల, మే 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాల్వేషన్ ఆర్మీ సెంట్రల్‌కోర్ ఆధ్వర్యంలో వీబీఎస్ ర్యాలీ నిర్వహించారు. సీవో మేజర్ డి.ఏబు సంఘస్థులు, సండేస్కూల్ విద్యార్థులతో కలిసి జమ్ములపాలెం ఆర్‌వోబీ పరిసరాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు బైబిల్ వ్యాఖ్యలు, పాటలు వంటివి నేర్పిస్తారన్నారు. కార్యక్రమంలో మేజర్ డి.జ్యోతి, సంఘ పెద్దలు, సండేస్కూల్స్ టీచర్స్ ప్రకాశవర్ధిని, సృజన, సరిత, ఎలిజబెత్, మమత, స్వప్న, రీటా మార్గరేట్, కోఆర్డినేటర్ శారా, సండేస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



జంపని వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

వేమూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపనిలో ఉన్న శ్రీవీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో ఏకాదశ దీక్షతో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం తిరుమల తిరుపతి దేవస్థానముల దాస సాహిత్య ప్రాజెక్టు వారు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. ఉదయం స్వామికి యక్కల చినసుబ్రహ్మణ్యం, రోజా దంపతులు పంచామృతాభిషేకం జరిపి సాయంత్రం పండితుల తో మన్యుసూక్త పారాయణ చేయించారు. అనంతరం స్వామి వారికి అష్టోత్తర సహస్రనామార్చన చేశారు.

జిల్లాలోని పాఠశాలల పునర్వ్యవస్థీకరణ

● కలెక్టర్ వెంకటమురళి



కలెక్టర్‌ని సత్కరిస్తున్న డీఈవో పురుషోత్తం

బాపట్ల, మే 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు 2025 -2026 విద్యాసంవత్సరం నుంచి పాఠశాలలను పునర్వ్యస్థీకరణ చేసినట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జిల్లాలో మొత్తం 1341 పాఠశాలలు ఉండగా ఫౌండేషన్ పాఠశాలలు 1106, మోడల్ ప్రైమరీ పాఠశాలలు 232, ప్రాథమికోన్నత పాఠశాలలు 45, ఉన్నత పాఠశాలలు 189లను పునర్వ్యవస్థీకరించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం బాపట్లజిల్లాలో విజయవంతంగా నిర్వహించినందుకు విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఆదేశాల మేరకు గురువారం కలెక్టర్ జె.వెంకటమురళిని డీఈవో ఎస్ పురుషోత్తం సిబ్బందితో కలిసి ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఎగ్జామినేషన్స్ బాపట్ల అసిస్టెంట్ కమిషనర్ డి.ప్రసాదరావు, జిల్లా సైన్స్ అధికారి మహ్మద్ సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

కౌలుకార్డు ఉంటేనే పంట నమోదు

● వ్యవసాయశాఖాధికారి సుమంత్

కర్లపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి) : కౌలుదారులకు కౌలు కార్డులు అందిస్తున్నామని, కౌలు కార్డు ఉంటేనే పంటనమోదు చేయించుకోవచ్చునని తద్వారా పంటల బీమా, నష్టపరిహారం, కనీస మద్దతు పొందవచ్చునని వ్యవసాయాధికారి సుమంత్ తెలిపారు. గురువారం కర్లపాలెం, చింతాయపాలెం గ్రామాల్లో కౌలు కార్డుల పై రైతులకు అవగాహన కల్పించారు. కౌలుకార్డు కోసం రైతులు భూమి తాలూకు పాస్‌పుస్తకం, కౌలుదారుడి ఆధార్, పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో, ఫోన్ నెంబరు తీసుకొని వీఏఏలను లేదా, వీఆర్వోలను సంప్రదించాలని కోరారు. భూమి ఉన్న రైతులు తప్పనిసరిగా భూఆధార్ నెంబరును గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఈనెలాఖరు లోపు పొందాలని ఏవో తెలియజేశారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

● సీఐటీయూ కార్యదర్శి అగస్టీన్

వేమూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి బి.అగస్టీన్ పిలుపునిచ్చారు. గురువారం మండలపరిషత్ కార్యాలయం లో సూపరింటెండెంట్ అనూరాధకు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం పంచాయతీ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశం లో అగస్టీన్ మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సమ్మెలో గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సంఘ నాయకులు కె.నాగేశ్వరరావు, సీహెచ్ యోనేకు, ఎన్ ఏసుకిరణ్, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

20 మందితో బాపట్ల మార్కెట్ యార్డు కమిటీ

● గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే వేగేశన, చైర్మన్‌గా కావూరి

బాపట్ల, మే 15 (ఆంధ్రజ్యోతి): బాపట్ల వ్యవసాయ మార్కెట్‌యార్డు పూర్తిస్థాయి కమిటీని గురువారం ప్రకటించారు. గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, చైర్మన్‌గా కావూరి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్‌గా కర్లపాలెం మండల టీడీపీ అధ్యక్షుడు ఏపూరి భూపతిరావులను నియమించారు. సభ్యులుగా అడపాల శ్రీరామయ్య, కారుమంచి వెంకాయమ్మ, కోమట్ల కృష్ణచలపతిరెడ్డి, మన్నె సునీత, గుడివల్లి శారద, కోసూరి నాంచారమ్మ, పమిడి శివపార్వతి, కారుమూరి శారాకుమారి, పఠాన్ కరీముల్లాఖాన్, షేక్ అబ్బరూన్, గొట్టిపాటి శ్రీకృష్ణ, నిజాంపట్నం నాగరాజులతోపాటు అప్పికట్ల పీఏసీఎస్ స్పెషలాఫీసర్, హార్టికల్చర్ జిల్లా అధికారి, బాపట్ల మున్సిపాలిటీ స్పెషలాఫీసర్, జిల్లా అగ్రిట్రేడ్ అండ్ మార్కెటింగ్ ఆఫీసర్‌లను సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 20 మందితో ఏర్పాటైన ఈ నూతన కమిటి త్వరలో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిసింది.

ఇసుక తవ్వకాలను పరిశీలించిన అధికారుల బృందం



ఇసుక అక్రమ తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రామాంజనేయులు, మైనింగ్ ఏడీ రాజేష్

బాపట్ల, మే 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం వెదుళ్ళపల్లి బధిరుల ఆశ్రమ పాఠశాల వెనుక ఎంతోకాలంగా పెద్దఎత్తున జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై అధికారులు స్పందించారు. గురువారం మైనింగ్, పోలీసు అధికారులు ఆ ప్రాంతంలో తనిఖీలు చేశారు. విచ్చలవిడిగా ఇసుకతవ్వకాలు జరిపినట్లు గుర్తించారు. డీఎస్పీ రామాంజనేయులు, మైనింగ్ ఏడీ రాజేష్, రూరల్ సీఐ హరికృష్ణ సిబ్బందితో కలిసి పరిశీలించి అక్కడ ఇసుక తవ్వకాలు ఎవరు జరుపుతున్నారు సదరు భూములు ప్రభుత్వ భూములా లేక పట్టాభూములా అనే దానిపై విచారించారు. దీనిపై పూర్తి వివరాలు తెలియజేయాలని రెవెన్యూ అధికారులకు తెలియజేశారు. రెవెన్యూ అధికారులు నుంచి సమాచారం వచ్చిన తర్వాత లీగల్‌గా చర్యలు తీసుకుంటామని అధికారుల బృందం ప్రకటించింది. ఇదిలా ఉండగా నిత్యం అక్రమ తవ్వకాలు జరిపే ఈ ప్రాంతం అధికారుల రాకతో జేసీబీలు, టిప్పర్‌లు, ట్రాక్టర్‌లు తవ్వకాల జరిపేవారు లేకుండా పోవటం గమనార్హం.

మట్టి అక్రమ తవ్వకాలపై ఆర్డీవో పరిశీలన



మట్టి తవ్వకాలపై అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో రామలక్ష్మి

నగరం, మే 15(ఆంధ్రజ్యోతి): మట్టి అక్రమ తవ్వకాలపై ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆర్డీవో రామలక్ష్మీ అన్నారు. గురువారం సిరిపూడి, పూడివాడ, పెద్దమట్లపూడి, పెదపల్లి గ్రామాల్లో ఆమె సందర్శించి అక్కడ జరుగుతున్న భూమి తవ్వకాలను పరిశీలించారు. అక్రమ మైనింగ్‌పై స్థానిక ప్రజలు చేసిన ఫిర్యాదును పరిశీలిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. సంబంధిత శాఖలతో సమన్వయం పాటిస్తూ అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ రేపల్లెగా తీర్చిదిద్దుతాం : మున్సిపల్ కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సాంబశివరావు

రేపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సమష్టి కృషితో స్వచ్ఛ రేపల్లెగా తీర్చిదిద్దుతామని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఎన్జీవోలకు మున్సిపల్, మెప్మా, సచివాలయం సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యవంతంగా జీవించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

కోటేశ్వరమ్మ సేవలు చిరస్మరణీయం

● మున్సిపల్ మాజీ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరావు



మాజీ కౌన్సిలర్ చేజర్ల కోటేశ్వరమ్మ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న నరాలశెట్టి ప్రకాశరావు, కూటమి నాయకులు

బాపట్ల, మే 15 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పురపాలక సంఘంలో నాలుగు పర్యాయాలు కౌన్సిలర్‌గా గెలిచి ప్రజలకు విశేష సేవలందించిన చేజర్ల కోటేశ్వరమ్మ సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ మాజీ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరావు పేర్కొన్నారు. కోటేశ్వరమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని ఆమె విగ్రహం వద్ద జరిగింది. కూటమి నాయకులతో కలిసి పుష్పాంజలి ఘటించిన నరాలశెట్టి ప్రకాష్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో వరుసగా విజయం సాధించిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. ఇప్పటి వరకు మరెవ్వరు ఆమె రికార్డును దాటిపోలేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మందపాటి ఆంద్రేయ, కళ్ళం హరినాథరెడ్డి, జనసేన నాయకుడు విన్నకోట సురేష్, టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, కూచిపూడి ఝాన్సీరాణి, కారుమూరి అంజనేష్, కూచిపూడి శ్యామ్‌సుందర్, అల్లం గోపికృష్ణ, దిలీప్, ఐనంపూడి షాలెంరాజు, అడే వంశీ, కొటికలపూడి సురేష్, ఇంటూరి వంశీ, చేజర్ల సతీష్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

ధర్మకర్తలమండలి నియామక దరఖాస్తులకు ఆహ్వానం

● త్రిముఖ దేవాలయాల ఈవో నరసింహమూర్తి

పిట్టలవానిపాలెం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీలింగోద్భవస్వామి, శ్రీచెన్నకేశవస్వామి, శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానాలకు సంబంధించిన ధర్మకర్తలమండలి నియామకం కోసం ఆసక్తి గలవారు ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఈవో నరసింహమూర్తి తెలిపారు. బాపట్ల దేవదాయ, ధర్మదాయశాఖ శాఖ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన చెప్పారు. ఈ మూడు దేవస్థానాలకు సంబంధించి పాలక మండలికి ఐదుగురు ఓసీలు, ఒక నాయీబ్రాహ్మణ, బీసీ మహిళ, ఎస్సీ మహిళ, ఎస్టీ మహిళ, ఓసీ మహిళ మొత్తం 9మంది సభ్యులు ఉంటారని తెలిపారు.

అమరావతి రాజధానిని.. అత్యద్భుతంగా నిర్మిస్తున్నాం

- ఈ నగరంలా దేశంలో మరొకటి ఉండదు
- ఇప్పటికే నిర్మాణం జరిగిన యూనివర్సిటీలు అమెరికాలో కంటే బాగున్నాయి
- నేను తమాషాగా చెప్పడం లేదు.. మీరే వెళ్లి చూడొచ్చు
- డీఐఎల్ఆర్ఎంపీ వర్క్‌షాప్‌లో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): 'గుంటూరుకు 200 ఏళ్ల చరిత్ర ఉంది. అయినా కొన్నేళ్లుగా విస్మరనకు గురవుతోంది. అందుకే ఏ చిన్న అవకాశం వచ్చినా జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లు, సదస్సులు ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాం.' అని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఐటీసీ వెల్‌కం హోటల్‌లో ప్రారంభమైన డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడర్నైజేషన్ ప్రోగ్రాం వర్క్‌షాప్‌లో ఆయన జిల్లా చరిత్రని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రభుత్వ అధికారులకు నివేదించారు. ఈ జిల్లాలోనే అమరావతి రాజధానిని అత్యద్భుతంగా తమ విజనరీ నాయకుడు, సీఎం చంద్రబాబు నేతృత్వంలో నిర్మిస్తున్నామని వివరించారు. దేశంలో మరో నగరం అమరావతిలా ఉండే అవకాశం లేదని కొనియాడారు. మరోసారి ఇక్కడికి వచ్చినప్పుడు ఇలాంటి సదస్సుని అమరావతిలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. వాస్తవానికి ఐదేళ్ల క్రితమే అమరావతి రాజధాని నిర్మాణం జరగాల్సి ఉందని, 2019లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వచ్చిందన్నారు. ఇప్పుడు అమరావతికి వెళ్లినా అక్కడ నిర్మాణం జరిగిన మూడు విశ్వవిద్యాలయాల క్యాంపస్‌లు చూడొచ్చని, అవి అమెరికాలోని యూనివర్శిటీల కంటే బాగున్నాయంటూ కితాబిచ్చారు. అమరావతి అభివృద్ధి గురించి తాను ఏమి తమాషాలు చెప్పడం లేదన్న పెమ్మసాని, రాజధాని నిర్మాణం పూర్తి అయిన తర్వాత చూసి మీరే ఆశ్చర్యపోతారని ప్రతినిధులకు వివరించారు.

2027కి రీసర్వే పూర్తి

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాదు మాట్లాడుతూ భూముల రీసర్వే ద్వారా కేవలం భూమిని కొలవడం మాత్రమే కాదు, విశ్వాసాన్ని పునరుద్ధరిస్తున్నామన్నారు. భూ వివాదాలు పరిష్కరించడంతో పాటు బలమైన, ఆధునిక, సమగ్ర భూ రికార్డుల వ్యవస్థకు పునాది వేస్తున్నామని చెప్పారు. రీసర్వే జరిగిన ప్రతీ గ్రామంలో ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహించి భూయజమానుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తున్నామన్నారు. భూసర్వేపై సమగ్ర సమాచారాన్ని యజమానులకు అందించడానికి ప్రతీ బ్లాక్‌కు 50 నుంచి 70 మందిలో వాట్సాప్ గ్రూపులు కూడా ఏర్పాటు చేశామన్నారు. సర్వే షెడ్యూల్ వాట్సాప్, ఫోన్‌కాల్స్, రిజిష్టర్డ్ పోస్టు ద్వారా యజమానులకు ముందుగానే తెలియజేస్తున్నామన్నారు. ప్రతీ భూయజమాని వారి భూమి కొలత సమయంలో హాజరు కావడానికి మూడుసార్లు అవకాశం ఇవ్వడం జరుగుతుందన్నారు. భూయజమానులు వ్యక్తిగతంగా హాజరు కాకపోతే వారి సరిహద్దులను గుర్తించడానికి వీడియో కాల్స్ ఆప్షన్‌ని కూడా ఎంపిక చేసుకోవచ్చన్నారు. 2027 ఆఖరుకు రీసర్వే పూర్తి చేస్తామన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, పక్కన రెవెన్యూ మంత్రి అనగాని

రీసర్వేకు రూ.600 కోట్లు

కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ సెక్రెటరీ మనోజ్ జోషి మాట్లాడుతూ రాష్ట్రంలో భూముల రీసర్వే కార్యక్రమం కచ్చితమైన ప్రమాణాలతో వేగవంతంగా జరుగుతుందని ప్రశంసించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ జి.జయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో భూముల సర్వే రీ సర్వే కార్యక్రమం చాలా పురోగతిని సాధించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రీసర్వేకి రూ. 600 కోట్ల వరకు ఖర్చు పెట్టిందని వెల్లడించారు. కేంద్రం త్వరగా తమకు ప్రోత్సాహకాలు విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో వ్యవసాయ భూముల రీసర్వే, పట్టణాల్లో భూముల రీసర్వే కార్యక్రమమైన నక్షా ప్రక్రియకి సంబంధించి వివిధ దశలను వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనని ఆహ్వానితులకు చూపించారు. అలానే పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పురోగతిని వివరించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా, డీఆర్‌వో ఎన్ఎస్‌కే ఖాజావలి, గుంటూరు ఆర్‌డీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లోనే..అధికారితో ఉద్యోగిని అసభ్య ప్రవర్తన

- సీటీ శాఖలో హాట్‌టాపిక్‌గా వ్యవహారం
- ఉన్నతాధికారికి వీడియో దృశ్యాలు, విచారణకు ఆదేశం

గుంటూరు, మే 15(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారి వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుండగానే చాంబర్‌లో అధికారితో మహిళా ఉద్యోగిని అసభ్యంగా ప్రవర్తంచడం వాణిజ్యపన్నుల శాఖలో చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారం చూసిన సదరు ఉన్నతాధికారి వారిద్దరిని పిలిచి చీవాట్లతో సరిపెట్టినప్పటికీ ఇది కాస్త పైఅధికారుల దృష్టికి వెళ్లడంతో హాట్‌టాపిక్‌గా మారింది. సదరు ఉద్యోగులపై చర్యలు తప్పవని ప్రచారం జరుగుతోంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారం పూర్వపరాల్లోకి వెళితే... వాణిజ్య పన్నుల శాఖ గుంటూరులోని ఓ డివిజన్ కార్యాలయంలో జాయింట్ కమిషనర్ మూడు రోజుల క్రితం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అదే సమయంలో మరో అధికారి వీడియో కాన్ఫరెన్స్‌లో ఉండగానే చాంబర్‌లోకి వచ్చిన ఓ మహిళా ఉద్యోగిని సదరు అధికారితో అసభ్యంగా ప్రవర్తించారు. ఇది చూసిన ఉన్నతాధికారి ఆగ్రహం వ్యక్తం చేసి ఇద్దరిని తన చాంబర్‌కు పిలిపించుకొని చీవాట్లు పెట్టినట్లు సమాచారం. ఇంతటితో ఈ వ్యవహారం ముగిసిందని అంతా భావించారు. కానీ ఈ వ్యవహారం విజయవాడలోని ఉన్నతాధికారి దృష్టికి వెళ్లింది. వీడియో కాన్ఫరెన్స్‌లో ఉద్యోగిని చేసిన అసభ్య ప్రవర్తనపై ఫుటేజీలతో సహా ఫిర్యాదు వెళ్లింది. దీనిని ఉన్నతాధికారి సీరియస్‌గా పరిగణించినట్లు తెలిసింది. మూడు రోజులుగా ఈ వ్యవహారంపై విచారణ జరుగుతున్నట్లు చెబుతున్నారు. వీడియో దృశ్యాలు, ఫిర్యాదును పరిశీలించి సీరియస్‌గా పరిగణించిన ఉన్నతాధికారి తక్షణమే పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు తెలిసింది. ఇందులో సదరు అధికారి, మహిళా ఉద్యోగినిపై చర్యలకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

కందుకూరులో రోడ్డెక్కిన పొగాకు రైతులు

కందుకూరు, మే 15(ఆంధ్రజ్యోతి): పొగాకుకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, వ్యాపారులు రోజురోజుకి ధరలు దిగజారుస్తున్నారంటూ నెల్లూరు జిల్లా కందుకూరులో రైతులు ఆందోళన బాటపట్టారు. గురువారం వేలం ప్రక్రియ ప్రారంభమయ్యాక ధరలు దారుణంగా తగ్గిపోతున్నాయని గుర్తించిన రైతులు వేలంను నిలిపివేసి వేలంకేంద్రం బయట రోడ్డుపై బైఠాయించారు. దూబగుంట సమీపంలో ఉన్న కందుకూరు-1 వేలం కేంద్రంలో ఆందోళన చేపట్టిన రైతులు కందుకూరు - కనిగిరి ప్రధాన రహదారికి ట్రాక్టర్లు అడ్డంగా పెట్టి రాస్తారోకో చేశారు. చెన్నిపాడు, బాలిరెడ్డిపాలెం రైతులు మాట్లాడుతూ వేలం ప్రారంభించిన సమయంలో నాణ్యమైన పొగాకుకు అత్యధిక ధర రూ.280గా నిర్ణయించి కొనుగోళ్లు ప్రారంభించిన వ్యాపారులు కొద్దిరోజులు గడిచాక అతికొద్ది బేళ్లకు మాత్రమే ఆ ధర చూపిస్తూ అత్యధికశాతం నాణ్యమైన బేళ్లకు రూ.250లకే సొంతం చేసుకుంటున్నారని మండిపడ్డారు. బోర్డు అధికారులు రైతులకు సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు.

తెలుగువారి గుండెల్లో.. చెరగని సంతకం ఎన్టీఆర్

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తదితరులు

పెదనందిపాడు, మే, 15 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి గుండెల్లో చెరగని సంతకం ఎన్టీఆర్ అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని నాగులపాడులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో దాతలు, గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పెమ్మసాని మాట్లాడుతూ కాంగ్రెస్ కంచుకోటను బద్దలు కొట్టి దేశ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన రాజకీయ నాయకుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. అలాంటి గొప్ప వ్యక్తి విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడంతో పాటు ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వైఎస్ జగన్ నిర్లక్ష్యం వల్లే గ్రామాలు అంధకారంలో ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం అందించిన సహాయాన్ని జగన్ ప్రభుత్వం తీసుకోపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. జగన్ ప్రభుత్వం చేసిన అప్పులను సీఎం చంద్రబాబునాయుడు సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న నిధులను వినియోగించుకుంటూ తీరుస్తూ, సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ కిలో బియ్యం రెండు రూపాయలకే ప్రవేశపెట్టి, పేదవారి కడుపు నింపిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆయన ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో తనదైన ముద్రవేసిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని, ఆయన చేసిన మంచిని ముందు తరాలకు కూడా తెలియజేయాలన్నారు. అనంతరం విగ్రహ కమిటీ నిర్వాహకులు పెమ్మసాని, బూర్ల, లావులను శాలువాలు, మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. తొలుత లక్ష్మీపురం వద్ద నుండి ప్రచార వాహనంపై ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీగా నాగులపాడు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం వద్దకు చేరుకొని అక్కడ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగుదేశం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొర్రపాటి నాగేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకులు వందనాదేవి, జీడీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు, తాళ్ల వెంకట యాదవ్, మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, స్థలదాత కాపు వెంకటసుబ్బారావు, విగ్రహదాత జాలాది నాగప్రసాద్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు బండి నాగబాబు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు వేళాయే

- నేటి నుంచి జూన్ 2వ తేదీ వరకు అవకాశం
- జూన్ 3 నుంచి నిషేధం అమల్లోకి
- మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర ఆర్థిక శాఖ

గుంటూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు షెడ్యూల్ ఖరారైంది. ట్రాన్స్‌ఫర్లపై ఉన్న నిషేధాన్ని ఈ నెల 16 నుంచి జూన్ 2వ తేదీ వరకు సడలిస్తూ రాష్ట్ర ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం తాజాగా మార్గదర్శకాలను విడుదల చేసింది. నిర్దిత సమయంలోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని, జూన్ 3 నుంచి మళ్లీ నిషేధం అమలులోకి వస్తుందని స్పష్టం చేసింది. ఉద్యోగుల సంక్షేమం, వారి ఉద్యోగ జీవితాన్ని సమతుల్యం చేసేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొంది. ప్రజలకు సేవ చేయడంలో ఉద్యోగులు సరైన పోస్టులలో ఉండేలా చూసేందుకు బదిలీలు చేస్తున్నామని తెలిపింది. మే 31వ తేదీ లోపు ఒకే స్టేషన్‌లో ఐదేళ్ల పాటు ఉన్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలి. వ్యక్తిగత విజ్ఞాపన మేరకు కూడా ఈ నిబంధనతో సంబంధం లేకుండా బదిలీలు చేయొచ్చు. 2026 మే 31 లోపు రిటైర్డు అయ్యే ఉద్యోగులను బదిలీ చేయరాదు. ఒకవేళ వారు కోరుకొంటే చేయొచ్చు. అలానే పరిపాలన సౌలభ్యం కోసం కూడా బదిలీ చేసే అవకాశాన్ని కల్పించింది.

వారికి ప్రాధాన్యం

బదిలీల్లో అంధ ఉద్యోగులు, బుద్ధిమాంద్యం, గిరిజన ప్రాంతాల్లో రెండేళ్ల కంటే ఎక్కువ కాలం పని చేసిన వారు, 40 శాతం వైకల్యం ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తారు. మెడికల్ గ్రౌండ్స్ ఆధారంగా బదిలీలు కోరుకుంటున్న వారికి కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. కారుణ్య నియామకం పొందిన మహిళా ఉద్యోగులకు కూడా బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వాలి. అంధ ఉద్యోగులను బదిలీల నుంచి మినహాయింపు ఇస్తారు. ఒక వేళ వాళ్లు బదిలీ కోరుకొంటే స్పష్టమైన ఖాళీ ఉంటే బదిలీ చేయొచ్చు. భార్య, భర్త ఇద్దరూ ఉద్యోగులైతే ఒకే ప్రాంతంలో పోస్టింగ్ చేయాలి. ఒకవేళ వీలు పడకపోతే సమీపంలోని గ్రామంలోనే పోస్టింగ్ చేయాల్సి ఉంటుంది.

పారదర్శకంగా నిర్వహించాలి..

బదిలీలు పారదర్శకంగా చేయాల్సిన బాధ్యతని సంబంధిత ప్రభుత్వ శాఖ జిల్లా అధికారిపై ప్రభుత్వం ఉంచింది. బదిలీల్లో ఎలాంటి ఫిర్యాదులు, ఆరోపణలు రావడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ప్రభుత్వ గుర్తింపు పొందిన అసోసియేషన్లలో ఆఫీసు బేరర్లుగా ఉన్న ఉద్యోగులను బదిలీల నుంచి మినహాయించాలి. ఈ విషయంలో మూడు పర్యాయాలు/9ఏళ్ల స్టే నిబంధనని పాటించాలి. ఆఫీసు బేరర్ల జాబితాను సంబంధిత హెచ్‌వోడీలకు కలెక్టర్ ద్వారా ఆయా అసోసియేషన్లు పంపించాలి. అయితే ఈ నిబంధనతో సంబంధం లేకుండా బదిలీ చేసే అధికారాన్ని పరిపాలన సౌలభ్యం కోసం కాంపిటెంట్ అథారిటీకి కేటాయించింది. ఏవైతే డిపార్టుమెంట్లకు ఏకీకృత ఆపరేషనల్ సిస్టమ్స్ ఉన్నాయో ఆయా శాఖలు విధిగా మార్గదర్శకాలు జారీ చేయొచ్చు.

ఆదాయం ఉన్నా.. అభివృద్ధి సున్నా

- అద్దె భవనంలో కూచినపూడి మార్కెట్ యార్డు
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు



నిజాంపట్నంలో అద్దె భవనంలో కొనసాగుతున్న కూచినపూడి వ్యవసాయ మార్కెట్ యార్డు

రేపల్లె, మే 15(ఆంధ్రజ్యోతి): రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా కూచినపూడి మార్కెట్ యార్డు అభివృద్ధిని పాలక యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఏళ్ల తరబడి యార్డు అద్దె భవనాల్లో కొనసాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కూచినపూడి నియోజకవర్గం రద్దు కాకముందు ప్రత్యేక మార్కెట్ యార్డు కావాలని ఈ ప్రాంత రైతులు కోరారు. ప్రభుత్వం స్పందించి మార్కెట్ యార్డును మంజూరు చేశారు. అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి జిల్లాకు చెందిన మంత్రులు కాసు కృష్ణారెడ్డి, కన్నా లక్ష్మీనారాయణ, మోపిదేవి వెంకటరమణరావు అట్టహాసంగా యార్డును ప్రారంభించారు. కానీ, ఆ తర్వాత దానిపై దృష్టి సారించిన వారే కరువయ్యారు. నిజాంపట్నం మండలం కూచినపూడిలో మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కూచినపూడి నుంచి మార్కెట్ యార్డును నిజాంపట్నం తరలించారు. ప్రస్తుతం అక్కడ కూడా అద్దె భవనంలోనే మార్కెట్ యార్డు కొనసాగుతోంది. కనీసం మార్కెట్ యార్డుకు ఒక్క గోడౌన్ కూడా లేదు. ఈ మార్కెట్ యార్డు పరిధిలో వందలాది గ్రామాల్లోని రైతులు వినియోగించుకుంటారు. ఒక్క గోడౌన్ కూడా లేకపోవటంతో పండించిన పంటను ఎక్కడ దాచుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. చెక్ పోస్టుల ద్వారా మార్కెట్ యార్డుకు ఆదాయం వస్తున్నా కనీసం యార్డుకు స్థలసేకరణ చేసిన దాఖలాలు లేవు. గోడౌన్ గత వైసీపీ పాలకులు విస్మరించారు.

అరకొర వసతులే

కూచినపూడిలో అరకొర వసతుల మధ్య మార్కెట్ యార్డు భవనం కొనసాగుతోంది. గతంలో కూచినపూడి, లింగినేనివారిపాలెం మధ్యలో కొంత భూమిని పరిశీలించారు. అది ప్రధాన రహదారికి దూరంగా ఉందని విరమించుకున్నారు. యార్డు తొలి అధ్యక్షుడిగా రావి సాంబశివరావు విధులు నిర్వహించారు. యార్డు నిర్మాణానికి పాలకవర్గం చేసిన అభివృద్ధి నామమాత్రమే. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో మార్కెట్ యార్డు ఛైర్మన్‌ను నియమించారే తప్పా అభివృద్ధి చేసిన దాఖలాలు లేవు. మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించారు. రైతులకు మేలు చేసిందేమీ లేదని తీరప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. 2014-19 టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ పల్లపట్ల సమితి భవనాన్ని మార్కెట్ యార్డుగా ఏర్పాటు చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. కానీ ఫలించ లేదు. అప్పటి నుంచి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందాన పరిస్థితి ఉంది. రైతులు పండించిన ధాన్యాన్ని గోదాముల్లో భద్ర పరిచి గిట్టుబాటు ధర వచ్చి విక్రయాలు చేసుకునే వెసులుబాటు కల్పించాలి. కానీ గోదాములు లేకపోవడంతో ఆ పథకం పడకేసింది. కూటమిప్రభుత్వం అధికారం చేపట్టటంతో ఇటీవల మార్కెట్ యార్డు ఛైర్మన్‌ల నియామకం జరిగింది. టీడీపీ నిజాంపట్నం అధ్యక్షుడు ఓగిబోయిన వెంకట్ యాదవ్‌ను మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కూటమి పాలనలోనైనా యార్డును అభివృద్ధి చేస్తారని, పక్కా భవనాలను కల్పిస్తారని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు

ఏటా రూ.కోట్లలో రాబడి

మార్కెట్ యార్డు పరిధిలో చెక్‌పోస్టుల ద్వారా మొదటి ఏడాది రూ.50 లక్షలు ఆదాయం వచ్చింది. తర్వాత నుంచి ఆదాయం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం రూ.2 కోట్ల మేరకు ఆదాయం చేరింది. వసతుల కల్పనలో అధికారులు, పాలకులు తీసుకున్న చొరవ ఎక్కడా కనిపించడం లేదు. గోదాము నిర్మిస్తే ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది. గతంలో కూచినపూడిలో ఉన్న యార్డును రేపల్లె - నిజాంపట్నం ప్రధాన రహదారి పక్కన ఉన్న పల్లపట్ల సమితి కార్యాలయానికి మార్చాలనే ప్రతిపాదన పెట్టారు. రెవెన్యూ శాఖ ద్వారా నివేదికలను జిల్లా కలెక్టర్‌కు అందచేశారు. ఆ తర్వాత పురోగతి లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చొరవ తీసుకుని మార్కెట్‌యార్డు పల్లపట్ల సమితి భవనంలో ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలని రైతులు, తీరప్రాంత వాసులు కోరుతున్నారు.

నృసింహుని దర్శించుకున్న మీనాక్షి లేఖి



కేంద్ర మాజీమంత్రి మీనాక్షి లేఖితో మంగళగిరి బీజేపీ నేతలు

మంగళగిరి సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీమంత్రి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు మీనాక్షి లేఖి గురువారం మంగళాద్రి క్షేత్రాన్ని దర్శించారు. ఆమెకు బీజేపీ నేతలు ఘనస్వాగతం పలికారు. తొలుత దిగువ సన్నిధిలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి, శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎగువ సన్నిధిలో పానకాల స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి లక్ష్మీప్రసన్న, నేతలు నాగలక్ష్మి, గీతా మాధురి, విజయవాణి, మంగళగిరి నియోజకవర్గ కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మునగాల నాగేశ్వరరావు, డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరరావు, దామర్ల దుర్గారావు, రాకేష్‌జీ, మణికంఠ, కాండ్రు భానుకిషోర్, కమల కృష్ణ, రామమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 17, 18 తేదీల్లో గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్ఎం సుధేష్ణ సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. (07441) చర్లపల్లి - విశాఖపట్టణం ప్రత్యేక రైలు ఈ నెల 17న శనివారం మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి సాయంత్రం 5 గంటలకు నడికుడి, 6.40కి గుంటూరు, ఆదివారం వేకువజామున 3.35కి విశాఖపట్టణం చేరుకొంటుంది. (07442) విశాఖపట్టణం - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 18న ఆదివారం రాత్రి 11 గంటలకు బయలుదేరి సోమవారం ఉదయం 6 గంటలకు గుంటూరు, 7.10 గంటలకు నడికుడి, 11.40కి చర్లపల్లి చేరుకొంటుందని తెలిపారు.



వర్షంలో చిన్నారుల చిందులు



వర్షపు నీటిలో ద్విచక్ర వాహనంపై వెళ్తూ..



పట్టాభిపురం రోడ్డులో గాలి దుమారంలో పడిపోయిన బారికేడ్లు

మండుతూనే..ముంచెత్తింది..!

గుంటూరు, మే 15(ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేసవి మంట పుట్టించింది. ఎండ వేడిమికి ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. సాయంత్రానికి నాలుగు గంటల నుంచే ఆకాశం మేఘావృతమైంది. ఒక్కసారిగా గాలి, ఉరుములు, మెరుపులతో జోరు వర్షం కురిసింది. దాంతో నగరమంతా తడిసి ముద్దయింది. అర్ధగంట పాటు జోరు వర్షం కురవడంతో కొన్ని దిగువ ప్రాంతాల్లో వర్షపునీరు చేరి ప్రజలకు అసౌకర్యం కలిగించింది. గురువారం ఉదయం నుంచే ఎండ వేడిమి మొదలైంది. మధ్యాహ్నానికి ఎండ ప్రతాపం చూపుతూ వడగాలులు సైతం ప్రజల్ని ఆందోళనకు గురిచేశాయి. వేసవి తాపం తట్టుకోలేక ప్రజల రాకపోకలు మధ్యాహ్నానికే మందగించాయి. మధ్యాహ్నం మూడు గంటల నుంచే వాతావరణంలో మార్పు వచ్చింది. జోరు వర్షానికి వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చిన ప్రజలు పరుగులు పెట్టారు.

బాబోయ్ వడగాల్పులు

- వారం వ్యవధిలో నియోజకవర్గంలో వడదెబ్బకు పదిమంది మృతి
- జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచనలు


ఇంటింటి సర్వే చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

చీరాల, మే 15 (ఆంధ్రజ్యోతి) : పదిరోజులుగా వేసవి ఎండలు భగ్గుమంటున్నాయి. రోజు రోజుకు ఉష్ణోగ్రత తీవ్రత పెరుగుతుంది. వడగాలులు సైతం ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే నియోజకవర్గం పరిధిలో సుమారు 10 వరకు మరణాలు నమోదయ్యాయి. గత వారం నుండి రోజు 39 - 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవు తోంది. దీంతో చీరాల మండల పరిధిలోని తోటవారి పాలెంకు చెందిన ఉపాధి కూలీ పేర్లి ప్రకాశరావు(54) ఉపాధి పనిచేస్తూనే అక్కడే కుప్ప కూలాడు. అలాగే వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ పరిధిలో కంకిపాటి వల్లీకుమారి(64) గత మంగళ వారం బయటకు వెళ్లి వచ్చి ఇంట్లో అలసట తీరేందుకు ఏర్పాట్లు చేసుకొంటూ మృతి చెందింది. ఇలా చీరాల నియోజకవర్గంలో ఇంచుమించు పదిమంది మృతిచెందారు. ఈ విధంగా వరుస మరణాలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఏది ఏమయినా అధికారులు మాత్రం ఈదురు గాలులు, వడగాలులకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తు న్నారు. అంతేకాకుండా ఎండ సమయంలో బయ టకు వెళ్లాల్సి వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు..

వడదెబ్బ తగిలనప్పుడు వారికి చర్మం పొడి బారు తుంది. శరీరం నుండి వెచ్చని ఆవిరి వస్తుంది. వాంతులు అవుతాయి. తలనొప్పి అధికంగా ఉంటుంది. అలాగే కండరాలు నొప్పులు ఉంటాయి. శ్వాసకోస సమస్యలు తలెత్తుతాయి. తల తిరుగుతుంటుంది.

సమస్యకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఎండ సమయంలో బయటకు వెళ్లాల్సి వస్తే తలకు కచ్చితంగా టోపీ ధరించాలి. తెలుపు రంగు కాటన్ వస్త్రాలు ధరించాలి. సాధ్యమయినంత వరకు ఇంట్లోనే ఉండాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు, ఓఆర్ఎస్ కలిపిన నీరు తాగవచ్చును. నిమ్మరసం తీసుకోవడం ఆరోగ్యం. ఇంటి సరిసరాలు చల్లగా ఉండేలా చూసుకోవాలి. మొక్కలు ఇంటి పరిసరాల్లో ఉండేలా చూసుకోవాలి.

తేడాలు గమనిస్తే వైద్య సాయం పొందాలి -

శరీరంలో రోజువారీకు భిన్నంగా తేడాలు గమనిస్తే వైద్యులను సంప్రదించడం మంచిది. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహిస్తు న్నారు. ఎదయినా సమస్యలు గుర్తిస్తే వైద్యం అందిస్తున్నాము. వడ గాలులు పట్ల జాగ్రత్తలు పాటించడం ఉత్తమం.

డా.స్వాతికిరణ్, వైద్యాధికారి వేటపాలెం పీహెచ్‌సీ

షరా.. మామూలే!

సర్టిఫికెట్లు ఇవ్వడంలోనూ పైసలు పిండుతున్న అధికారులు

కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తుదారుల అవస్థలు

ఒంగోలులోని చెన్నకేశవ స్వామిపేటకు చెందిన ఓ చిరు వ్యాపారికి రెండేళ్ల క్రితం వివాహమైంది. తల్లిదండ్రుల నుంచి వేరుపడి భార్యా పిల్లలతో కలిసి రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. సచివాలయ సిబ్బంది మ్యారేజ్ సర్టిఫికెట్ కావాలని చెప్పడంతో ఆయన బుధవారం రిజిస్ట్రార్ ఆఫీసుకెళ్లాడు. అక్కడ సిబ్బంది సర్టిఫికెట్‌కు రూ. 4వేలు డిమాండ్ చేయడంతో అవాక్కయ్యాడు.

నాలుగు రోజులుగా వయస్సు ధ్రువీకరణ పత్రం కోసం వచ్చేవారితో ఒంగోలులోని జీజీహెచ్ కిక్కిరిసిపోతోంది. దంత పరీక్షలు చేయించుకుని వయస్సు నిర్ధారణ సర్టిఫికెట్ కోసం రావడంతో ఆసుపత్రిలోని డెంటల్ డాక్టర్ వారితో మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చారు అని అడిగారు. యర్రగొండపాలెం, మార్కాపురం, కంభం ప్రాంతాల నుంచి వచ్చామని చెప్పారు. 'అక్కడ ప్రభుత్వ ఆసుపత్రుల్లోని డెంటల్ వైద్యులు సర్టిఫికెట్‌లు ఇస్తారు కదా? ఇంత దూరం ఎందుకు వచ్చారు' అని వైద్యుడు అడిగారు. 'మా ఏరియాలో డాక్టర్‌లు మేము ఇవ్వకూడదు. ఒంగోలు వెళ్లి తీసుకోవాలి అని చెప్పడంతో ఇక్కడికి వచ్చాం సార్' అని బదులిచ్చారు.

'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించనట్టుంది' కొత్త రేషన్ కార్డు దరఖాస్తుదారుల దుస్థితి. పేద కుటుంబాలకు కొండంత అండ రేషన్ కార్డు. సంక్షేమ పథకాలు పొందాలన్నా ఇదే గీటురాయి. నూతన ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దరఖాస్తులు కూడా కుప్పలుతెప్పలుగా వస్తున్నాయి. దరఖాస్తుతో జత చేయాల్సిన పత్రాలు సేకరించడం మాత్రం లబ్ధిదారులకు సముద్రం ఈదినంత పని అవుతోంది. కీలకమైన మ్యారేజ్ సర్టిఫికెట్, వయస్సు ధ్రువీకరణ పత్రాలు పొందడం అర్హులకు తలకు మించిన భారం అవుతోంది. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.4వేలు డిమాండ్ చేస్తున్నారు. నిరక్షరాస్యుల వయస్సు ధ్రువీకరణ పత్రం కోసం ప్రభుత్వ ఆసుపత్రికెళితే దంత వైద్యులు సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో బిక్కముఖం వేస్తున్నారు.

మ్యారేజ్ సర్టిఫికెట్‌కు రూ.4వేలు వసూలు

వివాహమై ఇంతవరకు రేషన్ కార్డు లేనివారు కొత్త రేషన్ కార్డు పొందాలంటే కచ్చితంగా మ్యారేజ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంది. దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి అర్జీదారులు పరుగులు పెడుతున్నారు. సాధారణ రోజుల్లోనే పలు భూములు, స్థలాలు, ఇళ్ల రిజిస్ట్రేషన్‌ల విషయంలో రిజిస్ట్రార్ కార్యాలయం అంటేనే అవినీతికి కేరాఫ్‌గా అందరు భావిస్తారు. తాజాగా మ్యారేజ్ సర్టిఫికెట్‌ల మంజూరు అక్కడ పనిచేసే కొందరు ఉద్యోగులకు మరింతగా కలిసొచ్చింది. ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.4వేలు డిమాండ్ చేస్తున్నారని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త రేషన్ కార్డు పొందాలంటే అందుకు అవసరమయ్యే పత్రాలకు వేలకు వేలు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.


ఒంగోలులోని జీజీహెచ్‌లో కిక్కిరిసిన దరఖాస్తుదారులు



- వయస్సు ధ్రువీకరణ పత్రం పొందాలన్నా తిప్పలే
- ప్రభుత్వ వైద్యశాలల్లో నిరక్షరాస్యులకు సర్టిఫికెట్ ఇవ్వని వైద్యులు
- ఒంగోలు జీజీహెచ్‌కు పరుగులు తీస్తున్న లబ్ధిదారులు

ఒంగోలు, కార్పొరేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : కొత్త రేషన్ కార్డులపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈనెల 8 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులకు అవకాశం కల్పించింది. అయితే అందుకు అర్హత ప్రమాణాలు, అవసరమైన డాక్యుమెంట్‌లు సమర్పించాలని పేర్కొంది. అర్జీదారుడి కుటుంబ వార్షిక ఆదాయం రూ. 1.2 లక్షలలోపు ఉండటంతోపాటు, ఆరు దశల ప్రమాణాలను కలిగి ఉండాలని స్పష్టం చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో హౌస్ హోల్డింగ్ మ్యాపింగ్‌లో నమోదు కావడంతోపాటు, కుటుంబ సభ్యుల్లో ఎవరికీ రైస్ కార్డు ఉండకూడదని పేర్కొంది. ఆధార్ కార్డు, వివాహ ధ్రువీకరణకు రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి సర్టిఫికెట్, పెండ్లి ఫొటోలు తప్పనిసరి చేసింది. నిరక్షరాసులకు వయస్సు ధ్రువీకరణ పత్రం తీవ్ర సమస్యగా మారింది. అర్జీదారులు ఆయా సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

వయస్సు ధ్రువీకరణ పత్రాల కోసం ఒంగోలుకు..

చదువుకున్న వారికి విద్యార్హత సర్టిఫికెట్‌లలో నమోదు అయ్యే డేట్ ఆఫ్ బర్త్ సరిపోతుండగా, నిరక్ష్యరాస్యులకు డెంటల్ డాక్టర్లు నిర్ధారించాల్సి ఉంది. దరఖాస్తుదారులు, వారి కుటుంబ సభ్యులు జ్ఞానదంతాలను పరీక్షించి, వాటి ఆధారంగా, మేజర్, మైనర్‌గా వయస్సును నిర్ధారిస్తారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని డెంటల్ డాక్టర్లు సర్టిఫికెట్‌లు ఇవ్వకపోవడంతో జిల్లావ్యాప్తంగా దరఖాస్తుదారులు వయస్సు ధ్రువీకరణ పత్రాల కోసం ఒంగోలులోని జీజీహెచ్‌కు బారులు తీరుతున్నారు. జిల్లాలోని పశ్చిమప్రాంతం మార్కాపురం, వై.పాలెం, పెదారవీడు, కంభం, గిద్దలూరు, బేస్తవారపేట వంటి దూరప్రాంతాల నుంచి జీజీహెచ్‌కు వస్తున్నారు. దీంతో ఇక్కడి వైద్యులు వయస్సు ధ్రువీకరణ పత్రాలు ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనైనా పొందవచ్చని, ఇంత దూరం రావాల్సిన అవసరం లేదని వివరిస్తున్నారు. అయితే జిల్లాలోని ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ వయస్సు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో అర్జీదారులు నానాఅగచాట్లు పడుతున్నారు.

హంతకులను కఠినంగా శిక్షిస్తాం

- వీరయ్య చౌదరి కుటుంబానికి అండగా నేనున్నా
- అమ్మనబ్రోలులో మంత్రి లోకేష్


వీరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న లోకేష్

నాగులుప్పలపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): 'వీరయ్య చౌదరిని హత్య చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదు. వారిని కఠినంగా శిక్షిస్తాం. వీరయ్య కుటుంబానికి నేను అండగా ఉంటాను' అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ఒంగోలులోని తన కార్యాలయంలో దారుణ హత్యకు గురైన టీడీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబసభ్యులను అమ్మనబ్రోలులోని ఆయన స్వగృహంలో మంత్రి లోకేష్ పరామర్శించారు. తొలుత వీరయ్య చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. వీరయ్య సతీమణి సుచిత్ర, తనయుడు చంద్ర సిద్ధార్థలను లోకేష్ ఓదార్చి ధైర్యం చెప్పారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధి, కార్యకర్తల సంక్షేమానికి అహర్నిశలు పాటుపడిన వ్యక్తి వీరయ్య అన్నారు. యువగళం పాదయాత్రలో వంద రోజుల పాటు వెన్నంటే ఉండి తనతో అడుగులు వేశారని గుర్తు చేసుకొన్నారు. ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకొన్న వీరయ్య రాజకీయంగా ఎదుగుతున్న సమయంలో హత్యకు గురి కావడం తనను ఎంతగానో కలిచివేసిందన్నారు.

వీరయ్య హత్య కేసు దర్యాప్తు ప్రాథమిక దశలోనే ఉందన్నారు. మరింత లోతుగా దర్యాప్తు చేసి నిందితులు ఎంతటి వారైనా, ఎక్కడున్నా పట్టుకొని కఠినంగా శిక్షిస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ వీరయ్య కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట మంత్రులు డోలా బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు విజయ్‌కుమార్, దామచర్ల జనార్ధన్, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరరావు, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, మాజీ మంత్రి బాచిన చెంచు గరటయ్య ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి తగ్గింపు


ప్రకృతి వ్యవసాయం చేసిన రైతులను సన్మానిస్తున్న ఏడీఏ

యద్దనపూడి,(మార్టూరు)మే15(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా వ్యవసాయంలో సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చునని పర్చూరు ఏడీఏ మోహనరావు అన్నారు. గురువారం యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో వ్యవసాయశాఖ, వెలుగు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యత, నవధాన్యాలు సాగు విషయం, కేపీపీ గురించి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మోహనరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో ఎం.మేరమ్మ మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బోయపాటి సాంబ శివరావు, వీఆర్‌వో వసంతరావు, పంచాయతీ కార్యదర్శి భాగ్యరాజా, హరీష్, వినయ్ వెలుగు సిబ్బంది, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలురైతు గుర్తింపు కార్డులపై అవగాహన

బోడవాడ(పర్చూరు): పర్చూరు మండలం బోడవాడ గ్రామంలో గురువారం కౌలు రైతు కార్డుల సాగు గుర్తింపుపై ఏడీఏ మోహనరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ కౌలు రైతులను గుర్తించి వారికి కార్డులను మంజూరు చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసిందన్నారు. దీనిలో భాగంగా అర్హులైన ప్రతి కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవాలన్నారు. కార్యక్రమంలో ఏవో రామ్మోహన్ రెడ్డి గ్రామ సర్పంచ్ కన్నెగంటి సాంబయ్య, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాతిమండప నిర్మాణానికి విరాళం


విరాళాలు అందజేస్తున్న సింగమ్మ, శ్రీహరిరావులు

అద్దంకి, మే15 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతిముఖ మండపం నిర్మాణానికి అద్దంకికి చెందిన చిన్ని శ్రీహరిరావు, ఉమాదేవి దంపతులు రూ.1,01,116, కాకానిపాలెం మాదాల శింగమ్మ రూ.1,01,116లను గురువారం ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు. వారివెంట నందిరెడ్డి శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

18న టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు

- ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల స్థాయిలో నిర్వహణ

పర్చూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) :పర్చూరు ఉమ్మడి ప్రకాశం, గుంటూరు జిల్లాల స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు వేదిక కానుంది. స్థానిక వైజంక్షన్ సమీపంలోని రిగ్వేద్ క్రికెట్ ఏరీనా క్రీడా ప్రాంగణంలో ఈనెల 18న పర్చూరు క్రికెట్ క్లబ్ సౌజన్యంతో పోటీలు జరగనున్నాయి. మొదటి బహుమతి రూ.50వేలు, రెండవ బహుమతి రూ.35వేలు, మూడవ బహుమతి రూ.25వేలు, నాల్గవ బహుమతి రూ.15లతోపాటు జ్ఞాపికలను అందజేయనున్నట్లు నిర్వాహకులు తోట మణి తెలిపారు. వివరాలకు 9493515155, 7993090964 నంబర్లను సంప్రదించాలన్నారు.

అడుసుమల్లిలో చోరీ

అడుసుమల్లి(పర్చూరు), మే 15 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం అడుసుమల్లిలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. అడుసుమల్లి ఎస్సీ కాలనీలోని రేగులగడ్డ సత్యవతి ఇంట్లో దొంగలు పడి బీరువాలో ఉన్న రూ.15 నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. దీనిపై బాధిత మహిళ ఫిర్యాదుపై గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

మద్దిపాడు, మే 15(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. చేపట్టిన పనుల్లో ఎప్పటికప్పుడు పురోగతి ఉండటంతో పాటు పని ప్రదేశంలో తాగునీరు, నీడ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గురువారం మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరు గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగునీటి కాలువ పూడిక తీత పనులు చేస్తున్న కూలీల దగ్గరకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూలీలు సకాలంలో వారి ఖాతాల్లో కూలి డబ్బులు పడుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. ఎండల ప్రభావం ఎక్కువగా ఉన్నందున అన్ని జాగ్రత్తలు తీసుకుని పని చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఇనమనమెళ్లూరు ఫీల్డ్ చానల్‌ను కలెక్టర్ పరిశీలించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. కూలీలకు దినసరి కూలి రూ.300 దక్కేలా పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి పనులు ఉదయం 6 నుంచి 11 గంటల్లోపు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌వరప్రసాద్, తహసీల్దార్ ఎస్.నారాయణరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు, డ్వామా సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు


స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

నాగులుప్పలపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరులో వేంచేసిన శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వార్ల కళ్యాణ బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. స్వామివారి కల్యాణం మరుసటి రోజున ఉదయం చక్రస్నానం, పూర్ణాహుతి, హోమం నిర్వహించారు. అనంతరం తెలగ సంఘం ఆధ్వర్యంలో వసంత సేవ నిర్వహించారు. భక్తులు వసంతం, రంగులు చల్లుకొని కోలాహలంగా స్వామివారి గ్రామోత్సవం చేపట్టారు. ఈవో రామకృష్ణారావు, చైర్మన్ సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అశ్వవాహనంపై శ్రీవేంకటేశ్వరస్వామి

మద్దిపాడు, మే 15(ఆంధ్రజ్యోతి): మల్లవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు గురువారం కొలచనకోట గ్రామంలో అశ్వవాహనంపై విహరించారు. ఉభయదాతలు మోపర్తి సుబ్బారావు, మోపర్తి సందీప్‌చౌదరి, ఘంట సింగయ్య, జి.చిన్నఅబ్బయ్యచౌదరి, మోపర్తి చెంచురామయ్య, గుండ్లాపల్లి వెంకటకృష్ణయ్య, మోపర్తి గోపీనాథ్, గంట సుబ్బారావులు వ్యవహరించారు. కళ్యాణం అనంతరం స్వామివారు గ్రామానికి రావటం ఆనవాయితీగా వస్తున్నది. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఒంగోలు రూరల్ తహసీల్దార్‌గా నాయబ్‌రసూల్

ఒంగోలు(రూరల్), మే15 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు రూరల్ మండల తహసీల్దార్‌గా నాయబ్‌రసూల్ నియమితుల య్యారు. గురువారం ఒంగోలు లోని తహసీల్దార్ కార్యాలయం లో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ ఉద్యోగులు బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీనివాసరావు, చిరంజీవి, వీ ఆర్వో రామకృష్ణ, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పని చేసినా కూలి రాదాయే!

ఒక్కో కూలీ వారానికి రూ.200 ఇవ్వాలని హుకుం

- అంగీకరించని 5 పంచాయతీల్లో మస్టర్ల నిలిపివేత
- వేతనం అందక కూలీల అవస్థలు
- పెద్దారవీడు మండలంలో 'ఉపాధి' సిత్రమిదీ..


పెద్దారవీడులో ఉపాధి కూలీలు

పెద్దారవీడు, మే 15 (ఆంధ్రజ్యోతి): పనిచేసినా కూలి రాని పరిస్థితి పెద్దారవీడు మండలంలోని ఐదు గ్రామ పంచాయతీల్లో నెలకొంది. ఉపాధి కూలీలంతా ప్రతిరోజూ పనిచేస్తున్నారు. అందుకు సంబంధించిన మస్టర్లను మేట్లు సిద్ధం చేస్తున్నారు. కానీ చేసిన పనులకు సంబంధించి ఆన్‌లైన్ చేయడంలో కార్యాలయ సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఉపాధి కూలీలు చేసే పనులను దగ్గరుండి పర్యవేక్షించాల్సిన మండల, గ్రామస్థాయి అధికారులు ఆవైపు కన్నెత్తి కూడా చూడని పరిస్థితి మండలంలో నెలకొంది.

వారానికి రూ.200 వసూలు

'ప్రభుత్వం నిర్దేశించిన ఉపాధి పనులకు వచ్చి పనిచేయనీ, చేయకపోనీ.. ఒక్కో కూలీ వారానికి రూ.200 ఇస్తే మస్టర్లలో పేరు నమోదు చేస్తాం. లేకపోతే మీ పేర్లు గల్లంతే' అంటూ మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఉపాధి కూలీలను ఫీల్డ్ అసిస్టెంట్లు డిమాండ్ చేసినట్లు, దీనికి 14 పంచాయతీల్లోని ఉపాధి హామీ కూలీలు అంగీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. అందుకు సంబంధించి కూలీల వద్ద నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లు రూ.200 వసూలు చేసి ఉపాధి హామీ పనులను పర్యవేక్షించే మండల స్థాయి అధికారికి ఇవ్వాలని చెబుతున్నట్లు తెలిసింది.

ఐదు పంచాయతీల్లో మస్టర్ల నిలిపివేత

మండలంలోని ఐదు పంచాయతీల్లో కూలీలు చేసిన ఉపాధి హామీ పనులకు మస్టర్లు నమోదు చేయడంలో జాప్యం జరిగింది. మండల స్థాయి అధికారులు సూచించిన వారానికి రూ.200 వసూలు ప్రతిపాదన అమలుకాకపోవడమే ఇందుకు కారణమనే ప్రచారం జోరుగా సాగుతోంది. మండలంలోని పెద్దారవీడు, బద్వీటి చెర్లోపల్లి, చట్లమిట్ట, బోయలదుంపల, సానికవరం పంచాయతీల్లో కూలీలు చేసిన ఉపాధి పనులకు మస్టర్లు నమోదు కాలేదు. ఈ విషయమై మండలస్థాయి అధికారులను వివరణ కోరితే సర్వర్ సమస్య అంటూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంకేతిక పరిజ్ఞానంపై నెపం మోపుతున్నారు.

2000 మంది కూలీల వేతనాలు నిలిపివేత

మండలస్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని ఐదు పంచాయతీల పరిధిలో 2000 మంది ఉపాధి కూలీలకు వేతనాలను నిలిపివేశారు. పెద్దారవీడులో సుమారు 400, బద్వీటి చెర్లోపల్లిలో 500, చట్లమిట్టలో 400, బోయలదుంపలలో 300, సానికవరంలో 400 మందికి పని చేసినా వేతనం ప్రభుత్వం నుంచి పొందలేని పరిస్థితి నెలకొంది.

జరిగిన తప్పులను సరిదిద్దుతాం

మండలంలోని ఐదు పంచాయతీలలో మస్టర్లు నమోదు చేయకపోవడం వాస్తవమే. తాము డబ్బులు వసూలు చేయమని చెప్పామనడం నిజం కాదు. క్షేత స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- సుజాత, ఏపీవో, పెద్దారవీడు

ప్రముఖులకు వాటాలంటూ ప్రచారం

ప్రతివారం ఉపాధి కూలీల నుంచి రూ.200 చొప్పున వసూలు చేసే మొత్తంలో ఉన్నతాధికారులు, మండలంలోని ప్రజాప్రతినిధులు, విలేకరులకు వాటాలివ్వాలంటూ ఉపాధి హామీ సిబ్బంది జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఉన్నతాధికారులకు వాటా ఇవ్వకపోతే వారు బిల్లులు మంజూరు చేయరని, ప్రజా ప్రతినిధులకు వాటా ముట్టజెప్పకపోతే అసలు పనులే జరగనివ్వరని, క్షేత్రస్థాయి సిబ్బందిని నియమించుకున్నదే అక్రమాల్లో వాటాల కోసమని, పాత్రికేయులకు ముడుపులు ఇవ్వకపోతే అక్రమాలపై కథనాలు ప్రచురిస్తే ఉపాధి పనుల్లో డొల్లతనం బయట పడుతోందని మండలస్థాయి అధికారులు ప్రచారం చేస్తున్నారు.

అవీ..ఇవీ..

కౌలుగుర్తింపు కార్డుదారులకే రాయితీ


సీసీఆర్‌సీ కార్డులపై సూచనలిస్తున్న తహసీల్దార్, ఏవో

పంగులూరు, మే 15(ఆంధ్రజ్యోతి):పంటసాగు చేసే కౌలు రైతులు తగిన గుర్తింపు కార్డు కలిగి ఉంటేనే పంట రుణాలు, ప్రభుత్వ రాయితీలు పొందగలుగుతారని తహసీల్దార్ సింగారావు, ఏవో సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని ముప్పవరం, కొండమూరు గ్రామాలలో గురువారం సి.సి.ఆర్.సి. కార్డులపై కౌలు రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ నెల 31 లోగా కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, వీఆర్‌వోలు సుబ్బారావు, రవిబాబు, వీఆర్ఏలు దిల్షా, దినేష్‌కుమార్, ఆయా గ్రామాల కౌలు రైతులు పాల్గొన్నారు.

పంట సాగుదారు హక్కుపత్రంతో ప్రయోజనం

తోటవారిపాలెం (చీరాల) : పంట సాగు చేస్తున్న రైతులు సాగుదారు హక్కుపత్రం పొందడం ద్వారా ప్రయోజనం ఉంటుం దని ఏవో సుమతి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని తోటవారి పాలెం సచివాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీసీ సీఆర్‌పీ చట్టము -2019 ప్రకారం కార్డు కాలపరిమితి 11 మాసాలు మాత్రమే ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో డీటీ సుశీలదేవి, సెక్రటరీ భారతి, నాదెండ్ల కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

వేటపాలెంలో...

మండల పరిధిలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఖరీఫ్- 2025పై రైతులతో ప్రణాళిక నిర్వహించారు. ఈక్రమంలో పీఎండీఎస్ విధానంతో ఉపయోగాలను సూచించారు. భూమిలో చీడ పీడ లేకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏవో కాశీ విశ్వనాథ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాలీసెట్‌లో హర్షిత్ ప్రతిభ


హర్షిత్

అద్దంకిటౌన్, మే 15(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష పాలిసెట్‌లో అద్దంకిలోని సంజీవనగర్‌కు చెందిన విద్యార్థి బత్తుల హర్షిత్ 120 మార్కు లకు 111 మార్కులు సాధించాడు. రాష్ట్రస్థాయిలో 1304వ ర్యాంక్ సాధిం చాడు. ఏపీఆర్‌జేసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నందు 150 మార్కులకు 121 మార్కులు సాధించినట్లు విజేత కోచింగ్ సెంటర్ డైరెక్టర్ అంకమ్మరావు తెలిపారు. హర్షిత్ పదివ తరగతిలో 574 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పలువురు ఉపాధ్యాయలు, తల్లిదండ్రులు అబినందించారు.

నియోజకవర్గానికి రూ.7 కోట్ల నిధుల మంజూరు

● సీసీరోడ్లు, సైడు డ్రైన్లు ఏర్పాటుకు పనుల గుర్తింపు

అద్దంకి, మే15 (ఆంధ్రజ్యోతి): జిల్లా మినరల్ ఫండ్ కింద అద్దంకి నియోజక వర్గానికి రూ.7 కోట్ల నిధులు మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. పంగులూరు మండలంలో 30, బల్లికురవ మండలంలో 26, అద్దంకి మండలంలో 26, కొరిశపాడు మండలంలో 26, సంతమాగులూరు మండలంలో 32 పనులకు సంబంధించి నిధులు మంజూరు అయ్యాయి. ఆయా గ్రామాలలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ లు, ఇతర పనులు చేపట్టనున్నారు.

కమ్యూనిటీ హాల్స్‌కు రూ.70 లక్షలు మంజూరు

అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెంలో బీసీ కమ్యూనిటిహాల్‌కు రూ.30 లక్షలు, బల్లికురవ మండలం సూరేపల్లిలో కమ్యూనిటీహాల్‌కు రూ.20 లక్షలు, కొరిశపాడు మండలం రాచపూడిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు రూ.20 లక్షలు మంజూరయ్యాయి.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు


తీవ్రంగా గాయపడ్డ అంజయ్య

అద్దంకి, మే 15 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వృద్ధుడికి గాయాలైన ఘటన మండలంలోని గోపాలపురంలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన గోసాల అంజయ్య గురువారం ఉదయం బహిర్భూమి కి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడ్డ అంజయ్యను 108 వాహనంలో ఒంగోలు రిమ్స్ కు తరలించారు. ఘటనా స్థలాన్ని సీఐ సుబ్బరాజు పరిశీలించారు.

ఆయుష్మాన్ భారత్‌ను సద్వినియోగం చేసుకోండి

చీరాల, మే 15 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్(పిఎంజెఎవై)ను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ప్రతినిధి శేషబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగా నమోదు చేసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరికి రూ.5 లక్షలు వైద్యసేవలు పొందవచ్చని తెలిపారు. శనివారం పట్టణంలోని ఎస్ఆర్అండ్‌పీఎం హైస్కూల్, పేరాల ఏఆర్ఎం ఉన్నత పాఠశాలలో నమోదు ప్రక్రియ జరుగుతుందని చెప్పారు.

ఆపత్కాలంలో అందని సాయం

● ప్రమాద సమయంలో వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం దృష్టి ● అధికారులకు ఉత్తర్వులు జారీ


రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు (ఫైల్)

చీరాల, మే 15 (ఆంధ్రజ్యోతి) : రెప్పపాటు కాలంలో జీవితాలను రోడ్డుప్రమాదాలు చిన్నాభిన్నం చేస్తుంటాయి. కుటుంబానికి ఆసరగా ఉన్న వ్యక్తి మృతిచెందితే ఆ కుటుంబం వీధిన పడుతుంది. ప్రమాదానికి గురైతే చికిత్స కోసం నగదు వెచ్చించి ఆర్థికంగా ఆయా కుటుంబాలు చితికి పోతాయి. దీన్ని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం నగదు రహిత చికిత్స పథకం -2025 ను తీసుకొంది. అయితే దీనిపై అవగాహన లేకపోవడంతో బాధితులు సద్వినియోగం చేసుకోలేక పోతున్నారు.

రోడ్డు ప్రమాదాలు జరిగిన క్రమంలో ప్రమాదానికి కారకులు కొందరు అందుబాటులో లేకుండా పరారవుతుంటారు. అలాంటి కేసులు పోలీసు స్టేషన్లలో కోకొల్లలన్నాయి. ప్రస్తుతం 216 జాతీయ రహదారి విస్తరించిన తర్వాత ఇలాంటి ప్రమాదాలు అనేకం ఉన్నాయి. అలాంటి సమయాల్లో బాధితులకు తక్షణం వైద్యసాయం అందక వేలసంఖ్యలో అయోమయం స్థితిలో ఉంటున్నారు. సాధారణంగా ప్రమాదానికి కారణమైన వాహనానికి సంబంధించి థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్‌తో కొంత ప్రయోజనం ఉంటుంది. కానీ అసలు వాహనాలే గుర్తించకపోతే బాధితులు పరిస్థితి దయనీయంగా ఉంటుంది.

బాధితులను ఆదుకొనేలా..

ఈ నేపథ్యంలో బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉండేందుకు కేంద్రప్రభుత్వం ఆపత్కాలంలో సాయం అందించడానికి శ్రీకారం చుట్టింది. రోడ్డు ప్రమాదం బారిన పడి సాయం పొందని వారికి ఈ పథకం ద్వారా మృతిచెందిన బాధిత కుటుంబానికి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు ప్రకటించింది. అందుకు సంబంధించి వివరాలు ప్రమాదం జరిగిన స్టేషన్ పరిధి నుంచి, అలాగే ఆయా ప్రాంత రోడ్డు రవాణా శాఖ అధికారి నుండి వివరాలు సేకరించి కలెక్టర్‌కు నివేదిక అందజేయాల్సి ఉంది. తద్వారా నేరుగా బ్యాంకు ఖాతాలో నగదు జమ జరుగుతుంది. 2022లోనే కేంద్రం ఈ పథకం ప్రవేశపెట్టినా, నాటి వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా నీరు కార్చింది. వేల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరిగిన ఒక్కరంటే ఒక్కరికి కూడా సాయం అందజేయలేదు. అసలు ఈ పథకం ఉందని సామాన్య ప్రజలకు కూడా అవగాహన లేకపోవడంతో ఎందరో బాధితులు తీవ్రంగా నష్టపోయారు. ఊహించనిప్రమాదం జరిగితే, అవగాహన లేక సాయం కూడా పొందని దయనీయ స్థితిలో ఉన్నారు.

సాయం అందించడంపై టీడీపీ ప్రభుత్వం కసరత్తు

ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ పథకంపై దృష్టి సారించింది. ప్రమాద బారిన పడిన ఏ ఒక్కరు ఇబ్బందులకు గురి కాకూడదని అధికారులకు స్పష్టమైన ఆదేశాల జారీ చేసింది. ఇప్పటికే అధికారులు దీనిపై కసరత్తు ప్రారంభించారు. అలాగే ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించాలని అధికారులకు మార్గనిర్దేశాలు జారీ అయ్యాయి.

ప్రభుత్వం నుంచి సర్క్యులర్ అందింది

ఉన్నతాధికారుల నుండి హిట్ అండ్ రన్‌పై సర్క్యులర్ అందింది. అలాగే వీటిపై సమీక్షలు నిర్వహించనున్నారు. శిక్షణ అనంతరం పథకంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. పథకంతో బాధితులకు భరోసా ఉంటుంది.

రామకృష్ణారెడ్డి, రోడ్డు భద్రత అధికారి, చీరాల

చిన్నారుల్లో విద్యాజ్ఞానం పెంపొందించేందుకు కృషి

ఎమ్మెల్యే కొండయ్య


ప్రోత్సాహక నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), మే 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే పిల్లలకు చక్కనైన విద్యాజ్ఞానం అవసరమని, అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో వేటపాలెం మండలం పందిళ్లపల్లికి హైస్కూల్ విద్యార్థిని సజ్జా దివ్యశ్రీ 596 మార్కులతో సత్తా చాటింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే నేరుగా అనుమల్లిపేటలోని దివ్యశ్రీ ఇంటికి వెళ్లి ఆమెను ఘనంగా సత్కరించారు. అలాగే నగదు ప్రోత్సాహకం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ వ్యవస్థకు ధీటుగా బోధన జరుగుతుందన్నారు. విద్యా ర్థులు అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, పాఠశాల ఉపాధ్యాయులు, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలకు ఎల్‌ఈడీ లైట్లు, ఫ్యాన్లు


చందలూరులో ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేసిన ఫ్యాన్లు

పంగులూరు, మే 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో మండలంలోని 10 పాఠశాలలు, ఎస్సీ బాలుర వసతి గృహంలో ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్లు, పవర్ సేవింగ్ ఫ్యాన్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. విద్యుత్ ఆదా చేసే విధంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ ధృవీకరించిన లైట్లు, ఫ్యాన్‌లను పాఠశాలలో అమర్చుతున్నారు. కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్‌లో భాగంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ ద్వారా సమకూర్చిన 193 ఎల్‌ఈడీ ట్యూబ్ లైట్లు, 198 పవర్ సేవింగ్ ఫ్యాన్‌లు ఆయా పాఠశాలల అవసరాలకు తగిన విధంగా ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని చందలూరు, కొండమంజులూరు, ముప్పవరం, పంగులూరు ఉన్నత పాఠశాలలు, అలవలపాడు (ఉర్దూ), తూర్పు కొప్పెరపాడు, నూజెళ్ళపల్లి, కోటపాడు గ్రామాలలోని ప్రాథమికోన్నత, కొండమంజులూరు, నూజెళ్ళపల్లిలోని ప్రాథమిక పాఠశాలతో పాటు ముప్పవరంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. గురువారం చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు.

మందుబాబుల పరస్పర దాడులు

● చీరాల ప్రాంతీయ వైద్యశాలలో చికిత్స

వేటపాలెం(చీరాల), మే 15 (ఆంధ్రజ్యోతి) : మందుబాబులు పాతకక్షల నేపథ్యంలో పరస్పరం మద్యంసీసాలతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటన గురువారం వేటపాలెం రైల్వేస్టేషన్ సమీపంలోని మద్యందుకాణం వద్ద చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తుఫాన్‌పేటకు చెందిన లారీ డ్రైవర్ షేక్ కాలేషాకు, అదే ప్రాంతానికి చెందిన రోజువారీ కూలీ ముఠామేస్త్రీ పల్లపు అంకమ్మరాజుకు ఇటీవల స్వల్ప వివాదాలు ఉన్నాయి. ఈక్రమంలో మద్యం దుకాణంలో వేర్వేరుగా మద్యం సేవిస్తూ, ఘర్షణ పడ్డారు. దీంతో కాలేషా తలకు తీవ్ర రక్తగాయాలు కాగా, అంకమ్మరాజు స్వల్పంగా గాయపడ్డాడు. దీంతో చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు.

డేటా ఎంట్రీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

చీరాల, మే 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాబివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డేటా ఎంట్రీ కోర్సుల్లో ఉచితంగా మూడు మాసాలు ఉచిత శిక్షణ అందించనున్నట్లు సంస్థ జిల్లా అధికారి ప్రణయ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే శిక్షణకు సంబంధించిన వివరాలను 18 -30 సంవత్సరాల మధ్య గల పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఉపయోగించుకోవాలని, వివరాలకు 79814 43777 నంబరును సంప్రదించాలని తెలిపారు.

రహదారి నిర్మాణ పనులకు సహకరించండి

రైతులను కోరిన తహసీల్దార్ సింగారావు


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

పంగులూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): శరవేగంగా సాగుతున్న (బీవీఈసీ)గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులను ఆటంకపరచడం తగదని, రోడ్డు నిర్మాణంలో భూమిని కోల్పోయిన రైతులకు జ్యాప్యం లేకుండా ప్రభుత్వం తగిన పరిహారం చెల్లిస్తున్నదని తహసీల్దార్ సింగారావు అన్నారు. బెంగుళూరు, విజయవాడ ఎలివేటెడ్ కారిడార్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులను ఆటంకపరచిన జేవీ.పాలెం రైతులతో తహసీల్దార్ సింగారావు, సంబంధిత మెఘా ఇంజనీరింగ్ సంస్థ అధికారులు గురువారం చర్చించి వారికున్న అనుమానాలను నివృతి చేశారు. సేకరించిన భూమి వివరాలు, అందుకు నిర్దేశించిన నష్టపరిహారం, చెల్లింపుల గురించి వివరిం చారు. భూమి కోల్పోయిన రైతుల బ్యాంకు ఖాతాలలో సంబంధిత నగదు మొత్తాన్ని జమ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెగా ఇంజ నీరింగ్ సంస్థ జీఎం సుబ్బా నాయుడు, హైవేస్ సీనియర్ మేనేజర్ జగదీష్, కృష్ణంరాజు, సురేష్‌కుమార్, నరేష్, అంకమ్మరావు, సంబంధిత రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులను రైతులకు సకాలంలో అందించాలి

అద్దంకి ఏడీఏ శ్రీనివాసరావు


ఈ పోస్ యంత్రాలు అందజేస్తు ఏడీఈ శ్రీనివాసరాలు

మార్టూరు, మే15 (ఆంధ్రజ్యోతి) : రైతులకు నాణ్యమైన ఎరువులను సకాలంలో: డీలర్లు అందించాలని మార్టూరు ఏడీఈ కె వి శ్రీనివాసరావు అన్నారు.గురువారం మార్టూరు లో పారదీప్ ఫాస్ఫేట్ లిమిటెడ్ సంస్థ సహకారంతో,జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మార్టూరు డివిజన్ పరిదిలోని డీలర్లుకు ఈ పాస్ యంత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఏడీఈ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.ఈ సందర్బంగా ఆ యన మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న డిజిటల్ అధారిత చర్యలతో వ్యవసాయరంగం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు.రైతులకు మరింతగా లబ్ది చేకూర్చే నూతన మార్గాలను నిరంతరం అన్వేషించడమే వ్యవసాయశాఖ ప్రధాన లక్ష్యమన్నారు.అనంతరం అద్దంకి ఏడిఈ ధనరాజ్ మాట్లాడుతూ రైతులకు అధికంగా లబ్ది చేకూర్చేలా ఎరువుల పంపిణీలో వ్యవస్థాపిత మరియు డిజిటలైజేషన్ లక్ష్యంగా ఈ పాస్ యంత్రాల తయారీ చేయడం జరిగిందన్నారు.తరువాత యంత్రాలను వినియోగించే విధానంపై డీలర్లుకు వ్యవసాయఅధికారులు అవగాహన కలిగించారు.అదేవిధంగా యంత్రాల ప్రత్యేకతలను,వాటి ప్రయోజనాలను పారదీప్ సంస్థ మార్కెటింగ్ ఆఫీసర్ పి ప్రభాకర్ డీలర్లుకు వివరించారు.ఇంకా ఈ కార్యక్రమంలో మార్టూరు,అద్దంకి,కొరిశపాడు,,జె పంగులూరు,సంతమాగులూరు,బల్లికురవ మండలాలకు చెందిన వ్యవసాయఅధికారులు, పిపిఎల్ సంస్థ ప్రతినిధులు హరికృష్ణ,గోపి,వెంకట్రావు,పలువురు డీలర్లు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

● సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి : డీపీటీవో రవికాంత్


గ్యారేజ్ లో సిబ్బందితో మాట్లాడుతున్న రవికాంత్

అద్దంకి, మే15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిచాలని గుంటూరు, బాపట్ల డీపీటీవో రవికాంత్ అన్నారు. అద్దంకి, మేదరమెట్ల బస్టాండ్లను, ఆర్టీసీ గ్యారేజ్‌ను గురువారం ఆయన పరిశీలించారు. గతంలో అద్దంకి డిపో అధిక కేఎంపీఎల్ తీసుకవస్తూ, ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. ప్రస్తుతం వెనుక బడి ఉందని, సిబ్బంది అందరు అంకిత భావంతో పనిచేసి మరోసారి ప్రథమ స్థానంలో నిలిచేందుకు కృషి చేయాలన్నారు. అద్దంకి డిపోకు 13 కొత్త బస్సులు వచ్చాయని, త్వరలో ఆయా మార్గాలలో పాత బస్సుల స్థానంలో కొత్త వాటిని నడుపుతారన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో మంచినీరు అందుబాటులో ఉంచాలన్నారు. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఎం రామ్మోహనరావు, అసిస్టెంట్ డీఎం మహబూబి, కొండలు తదితరులు ఉన్నారు.

జాతీయ రహదారి పైప్‌లైన్ సమస్యకు పరిష్కారం


కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు

పర్చూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) :వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తిమ్మరాజుపాలెం ఎత్తిపోతల పథకం పైపులైన్ సమస్యలకు ఎట్టకేలకు పరిష్కారం లభించిది. పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం గ్రామం వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణం కొనసాగుతోంది. అయితే ఈ రహదారి, తిమ్మరాజుపాలెం ఎత్తిపోతల పథకానికి చెందిన అండర్ గ్రౌండ్ పైప్‌లైన్‌పై వెళుతున్న నేపథ్యంలో సమీపంలోని ఎత్తిపోతల పథకానికి ఇబ్బంది తలెత్తింది. దీనిపై స్థానిక రైతులు టీడీపీ నేత గోరంట్ల రామకృష్ణ ద్వారా ఎమ్మెల్యే ఏలూరి దృష్టికి సమస్యను తీసుకుపోయారు. రహదారి మీదుగా భారీ వాహనాలు రాకపోకలు ఉండడంతో పైప్‌లైన్ దెబ్బతిని నీటి సరఫరాలేక ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వివరించారు. రైతుల సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే జాతీయ రహదారి అధికారులతోపాటు, ఐడీసీ అధికారు ల దృష్టికి సమస్యను తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని ఆదికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో స్పందించిన అధికారులు సమస్యాత్మక ప్రాంతంలో 40 మీటర్ల పొడవున పాతపైపులను తొలగించి కొత్తపైపులతోపాటు, శాశ్వత పరిష్కారంగా బాక్స్ కల్వర్టు నిర్మించేలా చర్యలు చేపట్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంతో సంబంధింత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెక్కల కష్టం బుగ్గిపాలు

● అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం ● రూ.2 లక్షల ఆస్తి నష్టం


ప్రమాదంలో దగ్ధమైన నగదు

పర్చూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఊరికి దూరంగా ఉండే చెంచుకుటుంబం వారిది. నిత్యం కూలిపనులకు చేసుకుంటేనే వారి జీవనం సాగేంది. దీనికోసమే చంటి బిడ్డలను సైతం ఇంటిలో ఉంచి కూలికి వెళ్లారు. అయితే అనుకోని అగ్ని ప్రమాదం వారి రెక్కల కష్టాన్ని బుగ్గిపాలు చేసింది. వారు కష్టించి దాచుకున్న రూ.1.50 లక్షల నగదు, అరసవర బంగారం అగ్నికి ఆహుతైంది. మంటలు అంటుకున్న సమయంలో ఇంటిలోని చిన్నారులను స్థానికు లు గమనించి బయటకు తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన ఘటన గురువారం మండల కేంద్రమైన పర్చూరులోని చెంచు ల కాలనీలో చోటుచేసుకుంది. కాలనీకి చెందిన నల్లబోతుల రాజా కూలీ నాలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నారు. దీనిలో భాగంగా గురు వారం భార్య భర్తలు ఇరువురు కూలిపనులకు పోయారు. చంటిబిడ్డలైన ఇద్దరు చిన్నారులను ఇంటిలోనే ఉంచారు. ఈ క్రమంలో మధ్యాహ్నా అగ్ని ప్రమాదం చోటుచేసుకొంది. దీంతో ఇంటిలోని చిన్నారులు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు గమనించి వారిని బయ టకు తీశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. అయితే ఇల్లు కాలిపోయింది. ఇంటితో పాటు ఇంటిలో కాయకష్టం చేసి సంపాదించి కూడ బెట్టుకున్న రూ.1.50 లక్షల నగదుతో పాటు, అరసవర బంగారు అభరణాలు కాలిబూడిద య్యాయి. చెంచుల కాలనీకి చెందిన ఇంటిలో మంటలు చెలరేగటంతో చుట్టుపక్కల వారు గుర్తించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. విద్యు త్ షార్టు సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందా, మరే ఇతర కారణాల అనేది తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పర్చూరు ఎస్సై మాల్యాద్రి, రెవెన్యూ అధికారులు హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

నిరాశ్రయులైన కుటుంబం

రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం వారిది చంటి బిడ్డల ను ఇంటివద్దే వదిలివేసి కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్న వారికి అగ్ని ప్రమాదం తీవ్ర నష్టాన్ని నింపింది. ప్రమా దంలో ఇంటిలో ఉన్న సామాన్లతో పాటు, కూలీనాలీ చేసుకొని సంపాదించుకున్న నగదు కాస్తా కాలిబూడిద కావటంతో వారు బోరున విలపిస్తున్నారు.